శుక్రవారం
20-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 208
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

న్యూజిలాండ్ ప్రధాని రాజీనామా

న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆర్డెర్న్ వచ్చే నెలలో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఫిబ్రవరి 7వ తేదీ ప్రధానిగా తన చివరి రోజు అని వెల్లడించారు.

2లో

ఏప్రిల్ నుంచి ఆందోళన

నిస్సహాయ స్థితిలో ప్రభుత్వ ఉద్యోగులు

- జీతాలూ సక్రమంగా ఇవ్వడం లేదు
- ఉద్యోగుల ఆర్థిక స్థితి మరింత దారుణం
- గవర్నర్‌కు ఉద్యోగ సంఘాల నేతల ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులంతా నిస్సహాయ స్థితిలో ఉన్నారని, ఏప్రిల్ నుంచి ఆందోళనకు దిగక తప్పని పరిస్థితి కనిపిస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం రాజ్‌భవన్‌కు చేరుకున్న ఉద్యోగ సంఘ నేతలు గవర్నర్‌కు వారి పరిస్థితులు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం సూర్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలనే నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి చెల్లింపులు మరింత దారుణంగా ఉన్నాయన్నారు. ఉద్యోగుల అనుమతి లేకుండానే జీపీఎస్‌ను విత్ డ్రా చేశారు. దాదాపు 90 వేల మంది ఉద్యోగుల ఖాతాల నుంచి డబ్బులు తీసుకున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సాంకేతిక సమస్య వల్ల జరిగిందని చెప్తున్నారు. అలా అయితే వెంటనే సరి చేయాలి కదా... కానీ ఇంకా పరిస్థితి అలాగే ఉంది. ఉద్యోగ సంఘాల నేతలతో ప్రభుత్వం అవమానకరరీతిలో వ్యవహరిస్తోంది. ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని ఇంతవరకు అమలు చేయలేదు. చివరకు ఈ సంక్రాంతికి ఇస్తానని చెప్పిన డీఏ కూడా ఇవ్వలేదు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ఉద్యోగులకు ఇవ్వాల్సినవే అడుగుతున్నాం. వారు ఇస్తానన్నవే ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నాం. బహిరంగంగా చేసిన హామీలు నెరవేర్చడం లేదు. ఆర్థిక శాఖ అధికారులు, మంత్రివర్గ ఉపసంఘానికి తమ సమస్యలు అనేకసార్లు వివరించాం. వారు స్పందించకపోవడం వల్లే గత్యంతరం లేని పరిస్థితుల్లో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని సూర్యనారాయణ వివరించారు. ఉద్యోగుల బకాయిల చెల్లింపులపై జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, ఆయన కొన్ని అంశాలపై సందేహాలు వ్యక్తం చేశారని చెప్పారు. ఆర్టికల్ 309 ప్రకారం ఉద్యోగ వ్యవస్థపై ప్రత్యక్ష సంబంధాలు, అధికారాలు గవర్నర్‌కు ఉంటాయని, అందుకే ఆయనకు ఫిర్యాదు చేశామన్నారు. తమకు న్యాయం చేస్తామని గవర్నరు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర కౌన్సిల్‌లో నిర్ణయించి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులందర్నీ సమాయత్తం చేస్తామన్నారు. ఉద్యోగ సంఘ నేతలు ఆస్కార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఏ, డీఏల కోసమా
సలహాదారులు?

- ప్రమాదకరంగా మారిన నియామకాల వ్యవహారం
- రాజకీయాలు కోర్టు బయటే చూసుకోండి
- ప్రభుత్వ విధానంపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

విశాలాంధ్రబ్యూరో–అమరావతి: రాష్ట్రంలో రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కేంద్రంగా మార్చిన సలహాదారుల నియామకాల వ్యవహారంపై హైకోర్టు మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేసింది. దేవాదాయశాఖ సలహాదారు శ్రీకాంత్, ఉద్యోగుల సలహాదారు చంద్రశేఖర్ నియామకాలపై దాఖలైన వేర్వేరు పిటిషన్లను కలిపి హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈసందర్భంగా ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ శ్రీరాం సుబ్రహ్మణ్యం నిష్ణాతులైన వారినే రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులుగా నియమిస్తుందని కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోబోయే ముందు సలహాదారుల అభిప్రాయం తీసుకుంటుందని కోర్టుకు తెలిపారు. కాబట్టి వారి నియామకం విషయంలో మెరిట్స్‌పై వాదనలు వినిపిస్తామని హైకోర్టుకు వెల్లడించారు. ఈ సందర్భంగా సలహాదారుల నియామకంపై జరుగుతున్న రచ్చపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.ఉద్యోగుల టీఏ, డీఏ కోసం మరో సలహాదారుడిని నియమిస్తారా? అని ప్రశ్నించింది. ఈ సలహాదారుల నియామకం ప్రమాదకరమైన వ్యవహారమని పేర్కొంది ఏవైనా రాజకీయాలుంటే బయటే చూసుకోవాలని, కోర్టు వరకూ తీసుకురావద్దని సూచించింది. రాజకీయాలు తీసుకొస్తే ఎలా హ్యాండిల్ చేయాలో మాకు తెలుసని హెచ్చరించింది.

నాలుగు వారాల్లో ఫైనాన్స్ కమిషన్ నియమించండి

వైసీపీ ప్రభుత్వం ఇంతవరకు 5వ ఫైనాన్స్ కమిషన్‌ను నియమించలేదని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ సందర్భంగా మూడు నెలల్లో ఫైనాన్స్ కమిషన్‌ను నియమిస్తామని ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చింది. అయితే మూడు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్‌ను నియమించలేదని జీవీ రెడ్డి తరపున న్యాయవాది ఉమేష్ చంద్ర హైకోర్టులో వాదనలు వినిపించారు. దీని వల్ల నిధులు దారిమళ్లుతున్నాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా మారిందని కోర్టు దృష్టికి తెచ్చారు. ఫైనాన్స్ కమిషన్‌ను ఎందుకు నియమించలేదని ప్రధాన న్యాయమూర్తి ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. సమాధానంగా తాము ఫైనాన్స్ కమిషన్‌ను నియమించి ఆ ఫైల్‌ను గవర్నర్ వద్దకు పంపామని, అక్కడి నుంచి వచ్చిన వెంటనే ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని న్యాయమూర్తికి చెప్పారు. రెండు వారాల్లో ఈ నియామక ప్రక్రియ పూర్తి అవుతుందని వివరించారు. దీంతో నాలుగు వారాల సమయం ఇస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి పేర్కొంటూ తదుపరి విచారణ ఫిబ్రవరికి వాయిదా వేశారు.

ఉన్నత విద్యాశాఖలో ఖాళీల భర్తీ

- పాఠ్యప్రణాళికలో కొత్త కోర్సులు
- జూన్‌కల్లా ప్రక్రియ పూర్తి
- ప్రతి విద్యాసంస్థకు నాక్ అక్రిడిటేషన్
- సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

8లో

ఉన్నత విద్యాశాఖలో జూన్‌కల్లా ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. అలాగే విదేశాల్లో విద్యార్థులకు అందిస్తున్న వివిధ కోర్సులను పరిశీలించి వాటిని కూడా ఇక్కడ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

బీజేపీకి ప్రతికూల పరిస్థితులు

- ఈశాన్యంలో సత్తా చాటేందుకు ప్రాంతీయ పార్టీలు సిద్ధం
- మేఘాలయ కాషాయ కూటమికి బీటలు

2లో

11వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

- విడుదల చేసిన ఎస్ఎస్‌సీ
- అర్హత పదో తరగతి

న్యూఢిల్లీ: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) 11వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఏప్రిల్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్టు వెల్లడించింది. ఈ పోస్టులకు దరఖాస్తుచేసేందుకు పదో తరగతి అర్హత. వివిధ శాఖల్లో దాదాపు 11,409 మల్టీ టాస్కింగ్ (నాన్ టెక్నికల్) స్టాఫ్ (ఎంటీఎస్), హవల్దార్ ఉద్యోగాల ఖాళీల భర్తీ ఇందులో ఉన్నది. వీటిలో దాదాపు 10,880 పోస్టులు మల్టీ టాస్కింగ్ సిబ్బంది కాగా, 529 హవల్దార్ పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొనేందుకు తుది గడువు ఫిబ్రవరి 17 రాత్రి 11గంటల వరకు ఇచ్చింది. ఫీజు చెల్లింపునకు మాత్రం ఫిబ్రవరి 19వ తేదీ వరకు అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకునే

- మిగతా 2 లో

స్మార్ట్ మీటర్లపై వామపక్షాల భగ్గు

- విశాఖలో సీపీఐ, సీపీఎం నిరసన
- ప్రజాభిప్రాయ సేకరణ భేటీకి వెళ్లకుండా అడ్డగింత
- పోలీసు చర్యలపై జేవీ సత్యనారాయణమూర్తి ఆగ్రహం

విశాలాంధ్ర–విశాఖ: రాష్ట్రంలో కోటి 89 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. విశాఖలో గురువారం ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ఏపీ ఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణను సీపీఐ, సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన తెలిపాయి. అదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు లబ్ధి చేకూర్చేందుకు తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల అమలును తక్షణమే నిలిపివేయాలని

- మిగతా 2 లో

ప్రతిపాదన విరమించాలి

విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు రామకృష్ణ లేఖ

3లో

రాష్ట్రంలో పోలీసు రాజ్యం

- జగన్ కంటే పెద్ద నియంత డీజీపీ
- ప్రతి సమస్యపై హైకోర్టుకెళ్లాలా?
- జీవో-1 సాకుతో ప్రతిపక్షాలకు ఆటంకాలు
- ఫిబ్రవరి 8 నుంచి ప్రాజెక్టుల సందర్శన
- స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

2లో

ఇదీ లోకం!

ఇందుగలడందుగలడను
సందేహము వలదు 'సారు' ఎందెందు
వెదికినను అందందే కలరు!

పోరుబాటకు అనూహ్య స్పందన

- మూడో రోజుకి చేరిన సంతకాల ఉద్యమం
- జగనన్న కాలనీలు, టిడ్కో లబ్ధిదారులకు సీపీఐ నేతల భరోసా
- సమస్య పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆగదని స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర సమస్యలు, టిడ్కో ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యంపై లబ్ధిదారుల నుంచి సీపీఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సంతకాల సేకరణ ఉద్యమం గురువారం మూడో రోజుకి చేరుకుంది. సీపీఐ నేతలు రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీలను సందర్శిస్తూ లబ్ధిదారుల నుంచి సమస్యలు తెల్సుకుంటున్నారు. టిడ్కో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల తీరును పరిశీలిస్తున్నారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. సమస్య పరిష్కారమయ్యేవరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నారు. దీనిలో భాగంగా వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం, చిన్నశెట్టిపల్లె జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సీపీఐ బృందం

- మిగతా 2 లో

60 అంతరిక్ష మిషన్లకు చైనా సిద్ధం

ఏడాది చివరికి 200కుపైగా ప్రయోగాల లక్ష్యం

బీజింగ్: అంతరిక్ష మిషన్లలో చైనా దూకుడు పెంచింది. ఈ ఏడాది 60కుపైగా అంతరిక్ష మిషన్లు చేపట్టాలని సంకల్పించింది. ఈ క్రమంలో 200కుపైగా అంతరిక్ష నౌకలను కక్ష్యలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు చైనా అంతరిక్ష శాస్త్ర-సాంకేతిక సంస్థ (సీఏఎస్‌సీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. 2023 చివరికి సొంత అంతరిక్ష ప్రయోగాల రికార్డును తిరగరాయాలని చైనా యోచిస్తోంది. 64 అంతరిక్ష మిషన్లు, 188 అంతరిక్ష నౌకల ప్రయోగాలను గతేడాదిలో విజయవంతంగా చేపట్టింది. ముఖ్యంగా టియాంఝౌ-6 మానవరహిత కార్గో అంతరిక్ష నౌక, షెంఝౌ-16, షెంఝౌ-17 మానవసహిత అంతరిక్ష నౌకను టియాంగాంగ్ అంతరిక్ష కేంద్రానికి చేర్చింది. టియాంగాంగ్ టీ-ఆకారంలో ఉంటుంది. ఇందులో రెండు ల్యాబరేటరీ మాడ్యూళ్లున్నాయి. ఒకే సమయంలో ఆరుగురు ఉండవచ్చు. దీని జీవితకాలం 15ఏళ్లు అంటే 2038 వరకు పనిచేయగలదు. టియాంగాంగ్ అంతరిక్ష కేంద్రంలోని సిబ్బంది ఇనార్బిట్ రొటేషన్‌ను గతేడాది డిసెంబరులో విజయవంతంగా పూర్తిచేసిన చరిత్ర సృష్టించారు.

న్యూజిలాండ్ ప్రధాని రాజీనామా

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ ప్రధాని జసిండా ఆర్డెర్న్ వచ్చే నెలలో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఫిబ్రవరి 7వ తేదీ ప్రధానిగా తన చివరి రోజు అని వెల్లడించారు. తీవ్ర భావోద్వేగానికి గురైన ఆమె ఈ మేరకు గురువారం ప్రకటించారు. 2017లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడగా ఆమె ప్రధాని అయ్యారు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరగనున్న ఎన్నికలలో పోటీ చేయాలనుకోవడం లేదని జసిండా వెల్లడించారు. తన బాధ్యతలకు న్యాయం చేయలేని క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రధానిగా ఉన్న ఐదున్నరేళ్లు తనకు సంబంధించినంత వరకు ఎంతో క్లిష్టమైన సమయమని చెప్పారు. 'కష్టంగా ఉన్నందుకు రాజీనామా చేయడం లేదు. అలా అనుకుంటే పదవి బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకే తప్పుకునేదాన్ని. ఈ ఆరేళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. నేనూ మనిషినే... పని చేయగలిగినంత కాలమే పదవి కొనసాగాలి. ఇప్పుడు తప్పుకోవాల్సిన సమయం వచ్చింది. నీ ఈ నిర్ణయంపై పెద్దఎత్తున చర్చ జరుగుతుందని కూడా తెలుసు కానీ ఇంకా ఈ పదవిలో ఉండి దానికి న్యాయం చేయలేను. అందుకు అవసరమైన శక్తి నాలో తగ్గిపోయిందని గ్రహించాను' అని జసిండా చెమ్మగిల్లిన కళ్లతో తన పార్టీ సభ్యులనుద్దేశించి అన్నారు. అక్టోబర్‌లో ఎన్నికలు జరిగేంత వరకు తాను ఎంపీగా కొనసాగుతానన్నారు. జసిండా ఆకస్మికంగా తన నిర్ణయం ప్రకటించిన క్రమంలో తదుపరి ప్రధానిని లేబర్ పార్టీ వచ్చే ఆదివారం భేటీ అయి ఎన్నుకోనుందని తెలిసింది. అక్టోబర్ 14న సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. అప్పటివరకు కొత్తగా ఎన్నికయ్యే వ్యక్తి ప్రధానిగా ఉంటారు. జసిండా ఫిబ్రవరి 7వ తేదీ లోపు బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు.

అత్యంత బలహీనంగా పాక్ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ బ్యాంకు నివేదిక

వాషింగ్టన్: పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి అత్యంత బలహీనంగా ఉన్నదని ప్రపంచ బ్యాంకు నివేదించింది. 2024లో జీడీపీ వృద్ధిరేటు 3.2శాతానికి మెరుగైనప్పటికీ మునుపటి అంచనా 4.2శాతం కంటే తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఈ దేశంలోని ఖైబర్ పఖ్తూన్ సింధ్, బలూచిస్తాన్ రాష్ట్రాలలో పరిస్థితి మరీ దారుణంగా ఉన్నదని, గోధుమలు కొరత ఏర్పడటంతో అక్కడి ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే పాకిస్తాన్‌లో గోధుమల కోసం గొడవలు, ఆందోళనలు జరుగుతున్నాయి. రానున్న రోజుల్లో పరిస్థితి మరీ క్షీణించే సూచనలు ఉన్నాయి. మరోవైపు ప్రపంచ మాంద్యం గురించి ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో పాకిస్తాన్ ఆర్థిక వృద్ధి రెండు శాతానికి తగ్గుతుందని కూడా అంచనా వేసింది. 2022 జూన్ అంచనాతో పోలిస్తే రెండు శాతం తగ్గినట్లు ఇస్లాం ఖబర్ నివేదించింది. ఆర్థిక పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే మూడేళ్లలో దేశానికి 16.3 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఇప్పటికే చెప్పారు. ఇతర దేశాలు పాకిస్థాన్‌కు 33 బిలియన్ డాలర్లను ఇప్పటికే అందించాయి. ఐరాస ప్రధాన కార్యదర్శి జోక్యంతో 10 బిలియన్ డాలర్ల వరకు ఆపన్నహస్తం ఈ దేశానికి లభించింది. ప్రపంచంలోనే అత్యంత నీటిపారుదల సౌకర్యం ఉన్న సారవంతమైన గోధుమలను పండించే భూమి ఉన్న దేశంలో పిండి కొరత, దానిని దిగుమతి చేసుకోవడానికి డబ్బులేని పరిస్థితి నెలకొందని ఇస్లాం ఖబర్ నివేదించింది.

క్యూబాకు చైనా 100 మిలియన్ డాలర్ల విరాళం

బీజింగ్: క్యూబాకు చైనా 100 మిలియన్ డాలర్ల విరాళమిచ్చింది. ఇందుకు సంబంధించిన పత్రాలపై చైనాలోని క్యూబా రాయబారి కార్లోస్ పెరీరా, చైనా అంతర్జాతీయ అభివృద్ధి సహకార సంస్థ ఉపాధ్యక్షుడు తంగ్ వెహ్ంగ్ సంతకాలు చేశారు. 700 మిలియన్ యువాన్లు (100 మిలియన్ డాలర్లు) అందించనున్నట్లు ఈ ఒప్పందంలో పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో క్యూబా అధ్యక్షుడు డియాజ్ కెనెల్ చైనాలో పర్యటించిన సందర్భంగా భూరివిరాళాన్ని ఆ దేశం ప్రకటించింది. ఈ మేరకు క్యూబా రాయబారి కార్లోస్ ట్విట్టర్‌లో వెల్లడించారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ఈ విరాళం మొత్తం వినియోగమవుతుందని చెప్పారు. క్యూబా ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికలలో చైనా వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది ఆమోదమని కార్లోస్ వెల్లడించారు. క్యూబా, చైనా విద్య, విజ్ఞాన రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని అభివృద్ధి చేసుకున్నాయి.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చి దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని, జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ విరుద్ధ చర్యలపై అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకుని సమైక్యంగా ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. విజయవాడ దాసరిభవన్‌లో గురువారం రామకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు తలపెట్టిన బస్సుయాత్రకు జగన్ ప్రభుత్వం జీవో నంబరు-1 పేరుతో అడ్డంకులు సృష్టించడాన్ని రామకృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. బస్సుయాత్రకు అనుమతి కోసం డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి విద్యార్థి, యువజన సంఘాల నేతలు లేఖ ఇచ్చినప్పటికీ డీజీపీ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అసలు అనుమతిస్తారా?, లేదా? అనే విషయాన్ని డీజీపీ తేల్చిచెప్పడం లేదన్నారు. సీఎం జగన్ కంటే నియంతలా డీజీపీ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జీవో-1 అందరికీ సమానమేననీ, ఎవరిపైనా వివక్ష ఉండబోదని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటనకూ, ఆచరణలో అధికారుల వ్యవహరిస్తున్న తీరుకూ పొంతన లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో భాగంగా ప్రతి ఒక్కరికీ నిరసన ప్రకటించే అవకాశముందని, దానికి విరుద్ధంగా జగన్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. నాడు కడప స్టీలుప్లాంట్ కోసం సీపీఐ చేపట్టిన పాదయాత్రకూ జగన్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తే హైకోర్టుకు వెళ్లి అనుమతి తీసుకున్నామని గుర్తుచేశారు. ప్రతిపక్షనేత చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనకూ పోలీసులు అడ్డంకులు సృష్టించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీజేసిన జీవో నంబరు-1ను హైకోర్టు సస్పెండ్ చేసిందని, దానిపై ఈనెల 20వ తేదీన ప్రభుత్వం తరపున వాదనలు కొనసాగాల్సి ఉందన్నారు. అప్పటివరకు ప్రభుత్వం ఆగలేక ఆ జీవోపై సుప్రీంకోర్టుకు వెళ్లిందని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలపై అన్ని పార్టీలు, ప్రజాసంఘాలతో ఐక్య పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఇదే అంశంపై ఇప్పటికే చంద్రబాబుతో తాను భేటీ అయ్యానని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు మిగిలిన వామపక్ష, ప్రతిపక్ష పార్టీలతో చర్చిస్తున్నామని వివరించారు.

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పదేపదే ప్రజలపై భారాలు మోపుతున్నారని రామకృష్ణ విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై రూ.13వేల కోట్ల భారం మోపడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అసలు స్మార్ట్ మీటర్లు అవసరమా?, అదానీకి లబ్ధి చేకూరేలా జగన్ ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. జగన్ బినామీల కోసమే ఇదంతా చేస్తున్నారన్నారు. దీనిపై విద్యుత్ నియంత్రణ మండలికి లేఖ రాశానని చెబుతూ భారాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులు అన్నీ ఆగిపోయాయన్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు పోలవరం, వెలిగొండ తదితర ప్రాజెక్టులలో పురోగతి లేదని వివరించారు. ప్రాజెక్టులు పూర్తికానందున ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసులకు తాగు, సాగునీటి సమస్యలు అధికమయ్యాయన్నారు. ఫిబ్రవరి 8 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాజెక్టులను సీపీఐ బృందం సందర్శిస్తుందన్నారు. మైనారిటీ నాయకులు ఫారూఖ్ షుబ్లీ మాట్లాడుతూ జీవో నంబర్ 1కి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రామకృష్ణకు అన్ని వర్గాల ప్రజలు అండగా ఉంటారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంస్థ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంక్షేమ సంస్థ పక్షాన గురువారం గ్రామ వలంటీర్, వార్డు వలంటీర్, గ్రామ, వార్డు సచివాలయ విభాగం ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్‌ను నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు మూడేళ్లుగా బదిలీలు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ప్రకటన సమయంలో నాన్‌లోకల్ జిల్లాలలో ఎక్కువ ఉద్యోగాలు ప్రకటించడం వల్ల అక్కడ పరీక్ష రాసి ఉద్యోగం పొందిన వారంతా రోజూ వందల కిలోమీటర్లు దూరం ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు.

స్మార్ట్ మీటర్లపై వామపక్షాల భగ్గు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశాయి. ప్రజలపై భారాలు వేస్తే మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించాయి.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు అనుమతి ఉన్నా వామపక్ష నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఇప్పటికే విద్యుత్ చార్జీల భారాలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అల్లాడుతుంటే, స్మార్ట్ మీటర్ల పేరుతో మరోసారి భారాలు మోపేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు చెప్పడానికి ముందుగానే అనుమతి తీసుకున్నామని, అయినా తమను ఎందుకు అడ్డగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. బూటకపు ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే నిలుపు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తయారు చేసిన నివేదికలు తప్పుల తడక అని విమర్శించారు. స్మార్ట్ మీటర్లపై మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందించడం లేదని గుర్తుచేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రజలపై 13 వేల కోట్ల రూపాయల భారం వేయాలని ప్రతిపాదించడం సరైంది కాదన్నారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.5 వేల కోట్ల భారం పడిందని విమర్శించారు. పేద, సామాన్య, మధ్య తరగతిపై భారాలను ఈఆర్‌సీ తిరస్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో హిందూజాకు 1200 కోట్ల రూపాయలు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తే దానిని ఈఆర్‌సీ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో 75వేల ఎకరాల భూమిని హైడ్రోజల్ కంపెనీకి కారుచౌకగా కట్టబెట్టడాన్ని తిరస్కరించాలని కోరారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలు నిస్సిగ్గుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, జి.రాంబాబు, పి.చంద్రశేఖర్, సీఎన్ క్షేత్రపాల్, నాయకులు ఎండీ బేగం, ఎస్.మురళి, జి.జయ, కె.వనజాక్షి, పి.పద్మ, అన్నపూర్ణ, ఎం.మన్మథరావు, యు.నాగరాజు, ఎన్.నాగభూషణం, పి.గోవిందు, సీపీఎం నాయకులు వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, జి.అప్పలరాజు, పి.వెంకటరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులకు ఏప్రిల్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఉంటుందని ఎస్ఎస్‌సీ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే, పూర్తిగా ఎన్ని ఖాళీలు అనేది మాత్రం వివరంగా వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్టు తెలిపింది. ఎంటీఎస్ ఉద్యోగాలకు వయో పరిమితి 18 నుంచి 25 ఏళ్లు, హవల్దార్ ఉద్యోగాలకు 18 నుంచి 27 ఏళ్లు మించరాదని పేర్కొంది. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల పాటు వయో పరిమితిలో సడలింపు ఇచ్చింది. దరఖాస్తు రుసుం రూ.100గా నిర్ణయించిన ఎస్ఎస్‌సీ ఆన్‌లైన్‌లోనైనా, లేదా బ్యాంకులోనైనా చలానా తీసి పంపించవచ్చని సూచించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సీ అధికారులు.. తెలంగాణలోని హైదరాబాద్‌బీ కరీంనగర్, వరంగల్ సీబీటీ పరీక్ష రాసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సీబీటీ పరీక్షను రెండు సెషన్లలో నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లీష్, తెలుగుతో పాటు 12 ప్రాంతీయ భాషల్లోనూ ఈ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. రాతపరీక్ష ఆబ్జెక్టివ్ టైప్‌లోనే ఉంటుందని, సెషన్ 1కు నెగిటివ్ మార్కులు ఉండవనీ, సెషన్ 2 పరీక్షకు మాత్రం నెగెటివ్ మార్కులు ఉంటాయని స్పష్టంచేశారు. ఒక తప్పు సమాధానానికి ఒక మార్కు మైనస్ చేస్తామని వెల్లడించారు. అందువల్ల అభ్యర్థులు సమాధానాలు రాసేటప్పుడు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు.

బీజేపీకి ప్రతికూల పరిస్థితులు

ఈశాన్యంలో సత్తా చాటేందుకు ప్రాంతీయ పార్టీలు సిద్ధం

మేఘాలయ కాషాయ కూటమికి బీటలు

త్రిపురలో చతుర్ముఖ పోరు

న్యూఢిల్లీ: మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికలకు నగారా మోగింది. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌లో వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రాలు చిన్నవే అయినా ఇక్కడ వచ్చే ఫలితాలు మాత్రం ఆ తర్వాత జరగబోయే ఏడు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు, వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం చూపనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ భాగంగా ఉన్న కూటములే అధికారంలో ఉండటం వల్ల ఆ పార్టీకి ఈ ఎన్నికలు సవాల్‌గా మారాయి. ఇటీవలే హిమాచల్‌లో అధికారాన్ని కోల్పోయిన బీజేపీ ఈ మూడు రాష్ట్రాల్లోనూ ప్రతికూల ప్రతిస్థితులనే ఎదుర్కొంటున్నది. మరోవైపు సత్తా చాటుకునేందుకు ఈ ఎన్నికలు ప్రాంతీయ పార్టీలకు ఒక అవకాశంగా కనిపిస్తున్నాయి.

గత ఎన్నికల్లో మేఘాలయలో బీజేపీ మద్దతుతో ఎన్‌పీపీ అధికారంలోకి వచ్చింది. అయితే, ఇప్పుడు ఆ రెండు పార్టీల మధ్య పొత్తుకు బీటలు వారుతున్నాయి. తమ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఎన్‌పీపీ నేత, సీఎం కన్రాడ్ సంగ్మా ప్రకటించారు. గత ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచినా అధికారం దక్కించుకోలేని కాంగ్రెస్ ఇప్పుడు మరింత కష్టాల్లో ఉంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న తృణమూల్ మరింత పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నది. నాగాలాండ్‌లో ప్రస్తుతం ఎన్‌డీపీపీ, బీజేపీ, ఎన్‌పీఎఫ్ పార్టీలతో కూడిన యునైటెడ్ డెమొక్రటిక్ అలయెన్స్ అధికారంలో ఉంది. ఈ రాష్ట్రంలో ప్రతిపక్షమే లేదు. గత ఎన్నికల్లో 12 స్థానాలు గెలిచిన బీజేపీ ఇప్పుడు 20 స్థానాల్లో పోటీ చేయాలనుకుంటున్నది. మరోవైపు ఏడు గిరిజన తెగలకు చెందిన ప్రజలు తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది బీజేపీపై తీవ్ర ప్రభావం చూపవచ్చు.

త్రిపురలో గత ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా మేజిక్ ఫిగర్ సాధించి అధికారంలోకి వచ్చింది. ఆ ఎన్నికలలో బీజేపీకి స్థానిక గిరిజనుల పార్టీగా గుర్తింపు పొందిన ఐపీఎఫ్‌టీతో పొత్తు కలిసొచ్చింది. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారాయి. బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. ఐపీఎఫ్‌టీతోనూ బీజేపీ సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి.

2018లో విప్లవ్ దేవ్‌ను సీఎంగా ఎంపిక చేసిన బీజేపీ ఆయన పనితీరు బాగాలేదని కొంతకాలానికి దింపేసి మాణిక్ సాహాను సీఎం పీఠంపై కూర్చొబెట్టింది. ఆయనను కూడా కొందరు బీజేపీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు సుదీర్ఘకాలం త్రిపురలో అధికారంలో ఉండి గత ఎన్నికల్లో ఓడిన వామపక్షాలు తిరిగి బలంపుంజుకుంటున్నాయి. ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌తో వామపక్షాలు కలిసి పోటీచేసే అవకాశాలున్నాయి. గతంలో కాంగ్రెస్ కీలక నాయకురాలిగా పని చేసిన సుష్మిత దేవ్ నేడు తృణమూల్ కాంగ్రెస్‌లో కీలకంగా మారారు.

సమష్టి కృషితో సహకార సంఘాల అభివృద్ధి

పరుచూరి కోటయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన రావుల వెంకయ్య

విశాలాంధ్ర -చల్లపల్లి: సభ్యుల సమిష్టి సహకారంతోనే సహకార సంఘాలు అభివృద్ధి చెందుతాయని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య చెప్పారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం మంగళాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో సొసైటీ భవన నిర్మాణానికి సంబంధించిన స్థలదాత పరుచూరి కోటయ్య విగ్రహ ఆవిష్కరణ గురువారం జరిగింది. రావుల వెంకయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ చిత్తశుద్ధి, నీతి-నిజాయతి గలవారు సహకార వ్యవస్థలకు చైర్మన్లుగా ఉన్నప్పుడే సహకార సంఘాలు బలోపేతమవుతాయన్నారు. సహకార వ్యవస్థ గ్రామాలకు చాలా అవసరమన్నారు. వేల రూపాయలతో ప్రారంభమైన మంగళాపురం సహకార సంఘం నేడు రూ.30 కోట్లకు పెరిగిందంటే పాలకవర్గం అంకితభావం, సమిష్టి కృషి వల్లేనన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయాలనే సంకల్పంతో మంగళాపురంలో సొసైటీ నిర్మాణానికి స్థలం ఇచ్చిన మహోన్నతుడు కోటయ్య అని అభివర్ణించారు. మంగళాపురం సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేసి... కోటయ్య కలను నిజం చేయాలని పిలుపునిచ్చారు. సొసైటీ చైర్‌పర్సన్ పేరం నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొక్కు నాగేశ్వరరావు, ఎంపీటీసీ పిట్టు వెంకటేశ్వరమ్మ, పాలకేంద్రం అధ్యక్షులు పరిసే నాంచారయ్య, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు కొర్రపాటి ముఖర్జీ, కాళింగి ఆదిలక్ష్మి మాజీ సర్పంచ్ పరుచూరి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు చంద్ర రామకోటేశ్వరరావు(ఆనంద్) ప్రముఖ రైతు నాయకులు చంద్ర ప్రసాద్, డాక్టర్ చంద్ర జయదీప్, పరుచూరి వెంకన్నబాబు, దొక్కు చింతయ్య, పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చంద్ర రవికుమార్, సంఘ సభ్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎంతో ఏపీఎన్జీవో నూతన కార్యవర్గం భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎన్జీవో అసోసియేషన్ నూతన కార్యవర్గ నేతలు గురువారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కేవీ శివారెడ్డి, ప్యానల్ సభ్యులు ఈనెల 18న జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి జగన్ శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు పి.పురుషోత్తమ్ నాయుడు, డీవీ రమణ, పి.కృష్ణ, సీహెచ్.శ్రీనివాసరావు, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగులసంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వేమనకు సీఎం నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: యోగి వేమన జయంతి సందర్భంగా తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి సీఎం జగన్ గురువారం పుష్పాం జలి ఘటించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. యోగి వేమన జయంతిని ఏటా జనవరి 19న అధికారికంగా నిర్వహిస్తూ ఇటీవల జీవోను ప్రభుత్వం జారీచేసింది.

మేఘాలయలో 34 అసెంబ్లీ స్థానాల్లో అధిక వ్యయం

షిల్లాంగ్: మేఘాలయలో కనీసం 34 అసెంబ్లీ నియోజకవర్గాలను వ్యయ భరితమైనవిగా గుర్తించామని, ఆయా సెగ్మెంట్లలో పటిష్ఠ పర్యవేక్షణ ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నిక అధికారి ఎఫ్ఆర్ ఖార్కోంగోర్ గురువారం తెలిపారు. 60 స్థానాలున్న మేఘాలయ అసెంబ్లీకి ఫిబ్రవరి 27న ఎన్నికలు జరగనున్నాయి. 'రాష్ట్రవ్యాప్తంగా కనీసం 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో డబ్బు వినియోగం చాలా ఎక్కువగా ఉందని మాకు నివేదికలు అందాయి. అదనపు భద్రతా సిబ్బందిని మోహరించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చూస్తాం' అని ఆయన పీటీఐకి చెప్పారు. వివిధ కారణాలతో 747 పోలింగ్ కేంద్రాల్లో దాడులు జరిగే పరిస్థితి నెలకొందని, 399 పోలింగ్ కేంద్రాలు కీలకమైనవిగా గుర్తించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనను అరికట్టడానికి సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, పోలీసు పరిశీలకులతో కూడిన పరిశీలకులు ఉంటారని తెలిపారు

పోరుబాటకు అనూహ్యస్పందన

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించింది. సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలలో నీళ్లు, రోడ్లు, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు కల్పించకుండా ఇళ్లు కట్టుకోవాలంటూ లబ్ధిదారులపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. ఎన్నికల ముందు పేదలందరికి ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి, అధికారంలోకి వచ్చాక కేవలం ఒక సెంటు స్థలం ఊరికి దూరంగా ఇచ్చి, ఇల్లు కట్టకుండానే విస్తృత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కాలనీలు ఊరికి దూరంగా ఉండడంతో పేదలు ఎంతో వ్యయప్రయాసలకు లోనుకావల్సి వస్తున్నదన్నారు. నీళ్లు, రోడ్లు, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులు కల్పించకుండా ఇళ్ల నిర్మాణం ఎలా చేపడతారని ఆయన ప్రశ్నించారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలకు 2సెంట్ల స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి రుణం మంజూరు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరైన లబ్ధిదారుల నుంచి రూ.35వసూలు చేసి పునాదులు మొదలుపెట్టడం దారుణమన్నారు. ఇళ్లు ప్రారంభించి ఏడాది దాటినా ఇంకా అనేక ఇళ్లు పునాదుల వద్దే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జగనన్న కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయకార్యదర్శి షరీఫ్, పట్టణసమితి సభ్యులు డి.శివారెడ్డి, వై.హరి, ప్రమీళ, సురేష్, ప్రతాప్, సుజాత, రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారెడ్డి, కె.ఈశ్వరయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదలను ఇబ్బందిపెట్టకుండా రూ.5లక్షలివ్వండి - రామచంద్రయ్య

పేదలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయకుండా జగనన్న ఇళ్ల నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం కర్నూలు జిల్లా ఆదోని రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్ర సందర్భంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు పూర్తిగా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి, అధికారం చేపట్టాక మాట మార్చారని విమర్శించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చే 1,80,000 బేస్ మట్టం నిర్మాణానికి కూడా సరిపోవని, ప్రభుత్వం తక్షణమే నిర్మాణానికి సరిపడే విధంగా ఉచితంగా సిమెంటు, ఇసుక సరఫరా చేసి ఇళ్ల నిర్మాణం పూర్తికి ఐదు లక్షల రూపాయలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఫిబ్రవరి 6 న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టి, ఫిబ్రవరి 22న విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామనీ, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, రైతు సంఘం తాలూకా అధ్యక్ష ,కార్యదర్శులు కారన్న ,పెద్ద ఈరన్న, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, తాలూకా అధ్యక్షులు నెట్టి కంటయ్య, నాయకులు ఏంకే సుంకన్న, పులికొండ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లాలో

జగనన్న కాలనీలో నిర్మించే ప్రతి ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం జగనన్న కాలనీలలో నిర్మాణాలు,మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పెంటపాడు మండలం అలంపురం గ్రామంలోని జగనన్న కాలనీ సందర్శన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, బి.లక్ష్మీనారాయణ, మర్లపూడి కాటమరాజు, దిద్దె నాగేశ్వరరావు పాల్గొన్నారు. కొయ్యలగూడెం మండలం మంగపతి దేవి పేట గ్రామంలోని జగనన్న కాలనీలో సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన లేదు

- జస్టిస్ నాగార్జునరెడ్డి
- విశాఖలో ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: గృహ వినియోగదారులపై విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించి డిస్కంలు ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదని ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ గురువారం విశాఖ పట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో ప్రారంభ మైంది. చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పి.రాజగోపాల్‌రెడ్డి విశాఖపట్నం నుంచి అన్ని డిస్కంలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరిస్తారు. మూడు రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది. మొదటిరోజు ప్రజాభిప్రాయ సేకరణలో జస్టిస్ నాగార్జునరెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. వినియోగదారుల ప్రయోజనాలు, విద్యుత్ సంస్థల ఆర్థిక శ్రేయస్సు సమతూకంలో ఉండేలా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ వినియోగదారుల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా నియంత్రణ మండలి తీసుకున్న నిర్ణయాలను ఆయన వివరించారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి సీనియారిటీ జాబితాను పారదర్శకంగా ఉండేలా డిస్కమ్‌లు తమ వెబ్‌సైట్లలో కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రచురిస్తున్నాయన్నారు. విద్యుత్ ఆదా పరికరాల వినియోగంలో ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకు లైట్లు, ఎయిర్ కండిషనర్లు, సూపర్ ఎఫిషియంట్ ఫ్యాన్లను వినియోగదారులకు ముందస్తు చెల్లింపు ద్వారా లేదా ఆన్-బిల్ ఫైనాన్సింగ్ ఎంపికపై అందించే పైలట్ ప్రాజెక్టును కమిషన్ ఆమోదించిందన్నారు. పారిశ్రామిక యూనిట్లు దీర్ఘకాలంగా మూసివేయబడిన కాలంలో కనీస చార్జీల భారాన్ని నివారించడానికి ఖాయిలా పరిశ్రమల పాలసీని పునరుద్ధరించామన్నారు. స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లను క్రమబద్ధీకరించడానికి, లావాదేవీలలో పారదర్శకతను నిర్ధారించడానికి కమిషన్ ప్రత్యేకంగా 2022 రెగ్యులేషన్ 1ని నోటిఫై చేసిందన్నారు.

రాష్ట్ర నలుమూలల నుండి అందరికీ అవకాశం కల్పించడానికి వ్యక్తిగత విచారణలతో పాటు అవసరమైన విషయాలపై బహిరంగ విచారణలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. తమ అభిప్రా యాలు తెలియచేసేందుకు 57 మంది నమోదు చేసుకున్నా రని, ఈ మూడు రోజులు వారి నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థల సీఎం డీలు కె.సంతోషరావు (ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్), జె.పద్మజనార్దనరెడ్డి (ఏపీసీపీడీసీఎల్) తమ సంస్థల ప్రగతిని, వినియోగదారులకు అందిస్తున్న సేవలతో పాటు టారిఫ్ ప్రతిపాదనలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 20 మంది తమ అభిప్రాయాలు తెలిపారు. ఏపీఈఆర్సీ సెక్రటరీ కె.రాజబాపయ్య, విద్యుత్ పంపిణీ సంస్థల డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులుగా ఏఎన్ఎంలను నియమించొద్దు

గవర్నర్‌కు ప్రభుత్వ నర్సుల సమాఖ్య వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మంజులా దేవి గురువారం విజయవాడ రాజ్ భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య కార్యకర్తలుగా విధులు నిర్వర్తించే ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా సర్దుబాటు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేలా చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో ఆరోగ్య కార్యకర్తలైన ఏఎన్ఎంలను కేవలం రెండు సంవత్సరాల పాటు 'జీఎన్ఎం ట్రెనింగ్' పేరుతో శిక్షణ ఇచ్చి నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేయకుండా స్టాఫ్ నర్సులుగా ఆసుపత్రుల్లో సర్దుబాటు చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. 30 సంవత్సరాలు అవుతున్నా స్టాఫ్ నర్సులకు హెడ్ నర్సులుగా పదోన్నతులు ఇవ్వకపోగా, 10 12 సంవత్సరాల నుండి కాంట్రాక్ట్ పద్ధతిలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో జీఎంఎం, బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సెస్ చదివిన వారు మాత్రమే స్టాఫ్ నర్సులుగా విధులు నిర్వహిస్తున్నారని, వారిని ముందుగా రెగ్యులర్ చేసి అన్ని ఆరోగ్య శాఖలలో సర్దుబాటు చేయలని గవర్నర్‌ను కోరారు. స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాల్లో చేరటానికి కొన్ని అర్హతలు ఉండాలని, ముఖ్యంగా నర్సింగ్ కౌన్సిలింగ్‌లో తప్పకుండా రిజిస్టర్ అయి ఉండాలన్నారు. అలాగే రాత పరీక్షలు, మెరిట్ ద్వారా స్టాఫ్ నర్స్‌ను సెలెక్ట్ చేయాలని, ఈ అర్హతలు లేకుండా ట్రెనింగ్ ఇచ్చిన ఏఎన్ఎంని డైరెక్ట్‌గా స్టాప్ నర్సులుగా పోస్టులు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రంలో నర్సింగ్ వ్యవస్థకు న్యాయం చేకూర్చాలని, పై చదువులు చదవడానికి ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి అనుమతి ఇవ్వొచ్చు కాని, ఈ రకమైన ఏకపక్ష, అసంబద్ధ నిర్ణయం తగదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

పొగాకు రైతులకు రూ.25 వేల పరిహారమివ్వాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-ఒంగోలు: మాండూస్ తుపానుకు దెబ్బతిన్న పొగాకు తోటలకు ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం, బ్యారన్‌కు లక్ష రూపాయల వరకు వడ్డీలేని రుణం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రకాశం జిల్లా రైతు సంఘాల సమన్వయ కమిటీ అధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ... గత ఏడాది డిసెంబరు రెండవ వారంలో వచ్చిన మాండూస్ తుపాను వల్ల జిల్లాలో పొగాకు పంట తీవ్రంగా దెబ్బతిందన్నారు. 50 రోజులు నిండిన పొగాకు తోటలను పీకివేసి మరలా నాట్లు వేయాల్సివచ్చిందన్నారు. పొగాకు పంటకు వచ్చి బాడుగ బ్యారన్‌లలో ఒక సారి కాల్చటానికి ట్రిప్పుకు రూ.55 వేల వరకు రైతులు ఖర్చు చేస్తున్నారన్నారు. ఈ పాటికే బ్యాంకుల్లో అప్పు తెచ్చిన నగదు అయిపోయి తిరిగి నాట్లు వేసేందుకు డబ్బులు లేక రైతులు దిక్కుతోచని స్థితిలో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తుపాను కారణంగా జిల్లాలో 11వేల ఎకరాల్లో పొగాకు పంట దెబ్బతిందని, దీనిని ప్రభుత్వంతోపాటు, పొగాకు బోర్డు గుర్తించిందన్నారు.బోర్డు వద్ద రైతులకు సంబంధించిన రూ.635 కోట్లు నగదు ఉందని, విపత్తు సమయంలో కేంద్రం వెంటనే స్పందించి బోర్డు ద్వారా పొగాకు రైతులకు పరిహారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పొగాకు బోర్డు వెంటనే స్పందించి పొగాకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఏడాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పొగాకు పంట ద్వారా రూ.40వేల కోట్లు ఎక్సైజ్ డ్యూటీ, రూ.6వేల కోట్లు విదేశీ మారక ద్రవ్యం వస్తుందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పెనాల్టీల రూపంలో పొగాకు బోర్డు వద్ద ఉన్న రైతుల నగదు వందల కోట్లను వెంటనే నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవటానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హను మారెడ్డి, నాయకులు వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించాలి

విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో నివాస గృహాలకు, విద్యుత్ వినియోగ అవసరాల కోసం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు గురువారం ఆయన లేఖ రాశారు. 2025 మార్చిలోపు నివాస గృహాలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలన్నింటికీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలన్న విద్యుత్ నియంత్రణ కమిషన్ ప్రతిపాదన సరైంది కాదని రామకృష్ణ హితవు పలికారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ సంస్కరణలలో భాగంగా కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన తెచ్చారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఖర్చు వినియోగదారులపై పడటంతో పాటు విద్యుత్ వినియోగానికి ముందుగానే డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగ సమయం ఆధారంగా ధర నిర్ణయించే పద్ధతి కోసమే స్మార్ట్ మీటర్లను తెరపైకి తెచ్చినట్లు ప్రజలు అభిప్రాయ పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుం దని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ పంపిణీ సంస్థలు తెలిపాయని పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకయ్యే ఖర్చునూ వినియోగదారుల నుంచే వసూలు చేస్తామని ఇంధన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రకటించారని, ఫలితంగా మీటర్ల కోసం ఖర్చు పెట్టే రూ.13,502 కోట్ల భారం వినియోగదారులపై పడుతుందని రామకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం నుంచి రూ.5480 కోట్లు సబ్సిడీగా వస్తుందని చెబుతున్నప్పటికీ, మిగిలిన వేల కోట్ల రూపాయల ఖర్చంతా వృధాగానే మారుతుందని వివరించారు. కేంద్ర సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గిందని, ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని విమర్శించారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, 200 యూనిట్లపైన వినియోగించే నివాస గృహాలు, అమృత్ పట్టణాలు, నగరాల్లో స్మార్ట్ మీటర్లు పెడతామని చెబుతున్నారని, తర్వాత దశలవారీగా ప్రతి వినియోగ దారుడికి స్మార్ట్ మీటర్లు బిగించడం తప్పనిసరి చేస్తారని ఆయన హెచ్చరించారు. సార్ట్ మీటర్ల వల్ల ప్రస్తుతం నెలకు, రెండు నెలలకు విద్యుత్ బిల్లులు చెల్లించే విధానం రద్దవుతుందని, వినియోగానికి ముందే విద్యుత్ చార్జీలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, ఇది పేదల జీవి తాలతో ఆడుకోవడమేనని మండిపడ్డారు. ప్రీపెయిడ్ పద్ధతి వలన డబ్బు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుం దని, నిరుపేదలకు కరెంటు అనేది అందని ద్రాక్షగా మారు తుందని వివరించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించక పోవడంతో ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాల్టీలు, పంచాయతీలు, స్థానిక సంస్థలకు సరఫరా నిలిపి వేస్తున్నారని, కొత్త మీటర్ల వల్ల ఇంకా సమస్యలు ఉత్పన్నమ వుతాయని సూచించారు. వీధిలైట్లు, మంచినీటి సరఫరా వంటి సేవలు నిలిచిపోయే ప్రమాదముందని తెలిపారు. వ్యవసాయరంగంలో నీటి మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ పూర్తిగా విఫలమైందని, వ్యవసాయానికి అందించే ఉచిత విద్యుత్‌ను దశలవారీగా ఎత్తివేయడానికి ప్రభుత్వాల కుట్రలో భాగమే ఈ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు అని రామకృష్ణ విమర్శించారు. ప్రజల, విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

జూపార్క్‌ల అభివృద్ధికి చర్యలు: పెద్దిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ, తిరుపతి జూపార్క్‌లను మరింత అభివృద్ధి చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ, ఇంధన, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ అధికారులను ఆదేశించారు. మంగళగిరి అరణ్య భవన్‌లో గురువారం అటవీశాఖ అధికారులతో జూపార్క్‌ల అభివృద్ధిపై మంత్రి సమీక్షించారు. జూపార్క్‌లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. తిరుపతి, విశాఖ జూలకు ప్రభుత్వం ప్రత్యేకంగా సంచాలకులను నియమిస్తోందని, వారి అధ్వర్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జూ పార్క్‌ల్లో కొత్త జంతువులను ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా సమకూర్చు కోవాలని కోరారు. జూలలో సంరక్షిస్తున్న జంతువులకు అందించే ఆహారం నాణ్యతతో ఉండాలని, దీనిని పర్యవేక్షించేందుకు వెటర్నరీ యూనివర్సిటీ కాలేజీల్లోని నిపుణుల సహకారం తీసుకోవాలన్నారు. జంతువుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జంతువులను దత్తత తీసుకునే విధానం అమలులో ఉందని, విశాఖ, తిరుపతి చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలు, కంపెనీలను ఇందుకు ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం త్వరలోనే పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. జంతుప్రదర్శనశాలల్లో సదరు కంపెనీల ప్రకటనల ద్వారా ఆదాయం లభిస్తుందని మంత్రి చెప్పారు. సమీక్షలో అటవీశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, అటవీ దళాల అధిపతి వై.మధుసూదన్‌రెడ్డి, వన్యప్రాణి విభాగం అధికారులు శాంతిప్రియా పాండే, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రికార్డు ఆదాయం: ఎండీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ మునుపెన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ఆదాయం నమోదు చేసింది. ఈనెల 18న ఒక్క రోజులోనే రూ.23కోట్ల ఆదాయాన్ని సాధించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రికార్డు ఆదాయాన్ని నెలకొల్పింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...దీనికి ముఖ్యకారణమైన ప్రయాణికులకు ధన్యవాదాలు తెలిపారు. సాధారణంగా ఏటా సంక్రాంతి సమయంలో ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం నమోదవుతుంది. ఈ ఏడాది సాధించిన ఘనతకు ప్రత్యేకత ఉంది. గతేడాది తరహా టికెట్ల ధరలు 50శాతం అదనంగా పెంచకుండానే, సంక్రాంతికి సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడిపారు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను అత్యధికంగా వినియోగించుకున్నారు. సంక్రాంతి సమయంలో కార్గో ద్వారానూ సరాసరి ఒక్క రోజులోనే (ఈనెల 18వ తేదీన) రూ.55లక్షల ఆదాయం లభించింది. ప్రయాణికులకు ముందస్తుగా బస్సులను అందుబాటులో ఉంచడం, నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించడం, సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు ఎప్పటికప్పుడు బస్సులను పర్యవేక్షించడం, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయడం వల్లే ఆర్టీసీ రికార్డు స్థాయి ఆదాయం సాధించిందని ఎండీ ద్వారకా తిరుమలరావు వివరించారు. సంస్థలోని డ్రైవర్లు, కండక్టర్ల అంకితభావం, వారి కృషి ఫలితంగానే ఈ సంక్రాంతి ప్రత్యేక సమయంలో ఆర్టీసీ ఘనత సాధించిందన్నారు. పర్యవేక్షణలో అధికారుల సహాయాన్ని కొనియాడారు.

కొనుగోలు ధాన్యానికి 21 రోజుల్లోగా సొమ్ము

పౌర సరఫరాల మంత్రి కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజుల్లోగా సొమ్ము చెల్లిస్తున్నా మని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వెల్లడించారు. రైతే రాజు, రాష్ట్రానికి రైతే వెన్నెముక అని బలంగా నమ్మిన ప్రభుత్వంగా రైతులకు మేలు చేసేలా సీఎం వైఎస్ జగన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. రైతులకు ఎలాంటి నష్టం రాకుండా నేరుగా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని చెప్పారు. విజయవాడ పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహిం చారు. దళారి వ్యవస్థని పూర్తిగా నిర్మూలించామని, ధాన్యం సేకరించి డబ్బు నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు రైతుల్ని రెచ్చగొట్టినా రైతుల మాత్రం ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు పలికారని పేర్కొన్నారు. ప్రతి రైతుకు ఎకారానికి రూ.8వేల అదనపు లబ్ధి చేకూరిం దన్నారు. ప్రతిపక్షాలకు చెందిన రైతులనూ సీఎం ప్రశంసిస్తున్నారనీ, గతంలో ఎప్పుడూ లేనంతగా ధాన్యం సేకరిస్తున్నామని, రైతులకు మద్దతు ధర ప్రకటించి అమలు చేశామని వివరించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి 90శాతం ఇప్పటికే చెల్లింపులు చేశామన్నారు. ఈ ఏడాది 26లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని మంత్రి ప్రకటించారు. మిల్లర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ.900కోట్లు ఉన్నాయని, మిల్లర్ల పాత బకాయిలన్నింటినీ ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఉన్న 9,260 ఎండీయూ వాహనాలన్నీ పని చేస్తున్నాయని, ఏ బండీ ఆగలేదని స్పష్టం చేశారు.

రుగ్మతల నిర్మూలనకు బౌద్ధమే శరణ్యం

లే-లడఖ్ మహాబోధ ధ్యాన కేంద్ర వ్యవస్థాపకులు సంఘసేన మహాధీర

నందికొండ: సమాజ రుగ్మతల నిర్మూలనకు బౌద్ధమే శరణ్యమని లే-లడఖ్ మహాబోధి అంతర్జాతీయ ధ్యాన కేంద్ర వ్యవస్థాపకులు సంఘసేన మహాధీర అన్నారు. అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆధునిక ప్రపంచానికి మహాకరుణ పరిష్కారాలను అందిస్తుందని పేర్కొన్నారు. మహాకరుణ దివస్ ఉత్సవాలు, ఆచార్య బుద్ధ రక్షిత మహాధీర శతజయంతి ఉత్సవాల్లో భాగంగా, ఆయన నాగార్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సంఘసేన, మహాకరుణ ఆచరణ ఒక్కటే శాంతిని చేకూరుస్తుందన్నారు. ఆచార్య బుద్ధ రక్షిత రాసిన ధర్మపదం పుస్తకాన్ని బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య ఆవిష్కరించారు. బుద్ధుని బోధనలోని ప్రధానాంశాల సారమే ధర్మపదమని, ఇందులో మనిషిని శీలవంతునిగా, ప్రజ్ఞావంతునిగా తీర్చిదిద్ది ఎన్నో అంశాలున్నాయన్నారు. మహాబోధి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కస్సప మహాధీర, ఆనంద భిక్షువులు బుద్ధధర్మంపై ప్రసంగించారు. బుద్ధవనం ఒక అంతర్జాతీయ సాంస్కృతిక కేంద్రం అవుతుందన్నారు. అంతకుముందు బుద్ధవనం శివారులో ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన వ్యూ పాయింట్‌ను బౌద్ధ భిక్షువులకు మల్లేపల్లి లక్ష్మయ్య చూపించారు. బుద్ధవనంలోని మహాస్థూపం చుట్టూ గల 1240 బౌద్ధ శిలాఫలకాల్లో నిక్షిప్తం చేసిన సిద్ధార్థ గౌతముని జీవిత విశేషాలు, జాతక కథలు, బౌద్ధ పోషకులు, బౌద్ధాచార్యులు, బౌద్ధ పునరుద్ధారకుల శిల్పాలు, 1700 సంవత్సరాల తరువాత మళ్లీ అమరావతి శిల్ప కళను బుద్ధవనం ద్వారా ఈ తరానికి అందించిన తీరును, మహాస్థూపంలోని ప్రత్యేకతలను వారికి బుద్ధవనం బుద్ధిస్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ డా॥ ఈమని శివనాగిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో నానరక్షిత భంతే, జనవంశ భంతే, శోభన భంతే, సంఘపాల భంతే, 9మంది నవ బౌద్ధ భిక్షువులు, ప్రాంగ్రీలా బృంద సభ్యులు, బుద్ధవనం అధికారులు కె.సుధనరెడ్డి, క్రాంతిబాబు, శ్యాంసుందర్ రావు, స్థానిక బౌద్ధ ఉపాసకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బస్సు యాత్రకు సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో అనంతపురం జిల్లా లేపాక్షి నుంచి జరిగే బస్ యాత్రకు చేతి వృత్తిదారుల సమాఖ్య-ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ మద్దతు తెలపనున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు గడుస్తున్నప్పటికీ...ఆనాడు పార్లమెంట్‌లో ప్రతిపక్షమైన బీజేపీ మద్దతుతో రాష్ట్రానికి ప్రత్యేకహోదా కలిస్తామని, విభజన చట్టంలో పొందుపరిచిన బీజేపీ, అధికారంలోకి వచ్చిన అనంతరం మోసగించిందన్నారు. దీనివల్ల రాష్ట్రానికి పూర్తిగా అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రజలు చాలా త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్లకు అప్పగించి ప్రైవేటీకరణకు సిద్ధమైందని పేర్కొన్నారు. విద్యా, ఉపాధి అవకాశాలు లేవనీ, జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు, అధిక సంఖ్యలో పార్లమెంట్ సభ్యులను గెలిపిస్తే కేంద్రప్రభుత్వం మెడలు వంచుతానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మౌనంగా ఉన్నారన్నారు. ప్రత్యేక హోదాకోసం చేపట్టే బస్సుయాత్రకు కూడా అనుమతి ఇవ్వకుండా మోదీకి వత్తాసు పలకడం ఘోరమని, ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. అందుకే హోదా సాధన కోసం బస్సు యాత్రకు చేతి వృత్తిదారుల సమాఖ్య నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ మద్దతుగా నిలిచి జయప్రదం చేయాలన్నారు.

సామాజిక చైతన్యానికి వేమన స్ఫూర్తి: రోజా



విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: వేమన సామాజిక చైతన్యానికి స్ఫూర్తి అని, వారి పద్యాలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చాయని రాష్ట్ర పర్యటక, సంస్కృతి వ్యవహారాల శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. గురువారం అనంతపురం జిల్లా కదిరిలోని గాండ్లపెంట మండలంలో కటారుపల్లి యోగి వేమన సమాధిని, ఆలయాన్ని సందర్శించారు. అనంతరం జడ్పీ హైస్కూల్ ఆవరణలో యోగి వేమన జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజా, యోగి వేమన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రభుత్వం అధికారికంగా యోగి వేమన జయంతి ఉత్సవాలను నిర్వహిం చడం సంతోషమని రోజా అన్నారు. సుమారు 350 సంవత్సరాల క్రితం మహాకవి వేమన పద్యాలు నేటికీ ఎంతో ప్రాచుర్యాన్ని పొందుతుండడం ఈ ప్రాంత ప్రజలు తమ అదృష్టంగా భావిస్తున్నారన్నారు. ఆనాడు సమాజం లోని రుగ్మతలను పారదో లెందుకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన పద్య రచన శైలితో వేమన చైతన్యవంతం చేశారనీ, పద్యాలలో జీవిత నగ్న సత్యాలు నేటి తరం వారికి స్ఫూర్తి దాయకంగా ఉన్నందున వేమన పద్యాల సారాంశ లను గ్రహించాలన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గాండ్లపెంట మండలాన్ని ఇక నుంచి యోగి వేమన కటారుపల్లి మండలంగా నామకరణ చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు ఆమె తెలిపారు. కటారుపల్లికి తారు రోడ్డు పనులకు టెండర్లు పిలచామనీ, వచ్చే నెల నుంచి పనులు ప్రారంభమవుతాయన్నారు. ఫిబ్రవరి మాసం నుంచి రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ వేమన పద్యాలు వినని తెలుగు వారు లేరంటే అతిశయోక్తి కాదన్నారు. అనంతరం వక్తలు యోగి వేమన కీర్తిని ప్రశంసించారు. యోగి వేమన వంశస్థులు టి వేమారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, చెన్నారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలను మంత్రి సన్మానించారు. విద్యార్థులకు మంత్రి రోజా చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. వివిధ శాఖ అధికారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్మన్ బి.గిరిజమ్మ, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, శంకర్ నారాయణ, జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, రాయదుర్గం రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ భారతి, యోగి వేమన రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అవకాశాలు వినియోగించుకోవాలి: కొమ్మినేని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతున్న మీడియా రంగంలో అవకాశాలను వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సూచించారు. సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ-విజయవాడ, మేరి స్టెల్లా కళాశాల జర్నలిజం విభాగం సంయుక్తంగా గురువారం 'జర్నలిజం మౌలిక సూత్రాలు- విలువలు' అంశంపై సదస్సు నిర్వహించారు. కొమ్మినేని ప్రసంగిస్తూ తన 40 ఏళ్ల జర్నలిజం ప్రస్థానంలో చాలా ఆటు పోట్లను ఎదుర్కొన్నానని, వృత్తిలో రాణించాలంటే ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ సమాజంలో జరిగే పరిస్థితులపై అధ్యయనం చేయాలన్నారు. అంతర్జాతీయ మీడియా సంస్థల్లో పని చేయాలంటే డిజిటల్ సాంకేతికతలో వస్తున్న మార్పులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఏపీ ఎన్నార్టీ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి మాట్లాడుతూ విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకోవాలన్న ఆసక్తి కలిగిన రాష్ట్ర విద్యార్థులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని, విద్యారంగంలో వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థుల కలను ఎన్నార్టీఎస్ నెరవేరుస్తుందని చెప్పారు. అందుకు సంబంధించిన వివరాలను తెలుపుతూ ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావును మేరి స్టెల్లా కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రెస్ అకాడమి కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ ఈ కార్యక్రమాన్ని సమన్వయ పరిచారు. కళాశాల యాజమాన్యం తరపున సిస్టర్ స్లీవా తుమ్మ, సిస్టర్ సహాయ, శరత్ చంద్ర, ఎన్నార్టీఎస్ సంయుక్త సంచాలకులు దండమూరి పద్మావతి పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌కు అవినీతి చెద

- పట్టించుకోని అధికారులు
- ఆదాయానికి భారీ గండి

విశాలాంధ్ర-చోడవరం (అనకాపల్లి): రాష్ట్రంలోని సహకార చక్కెర మిల్లులన్నింటిలో అగ్రభాగాన నిలిచిన గోవాడ షుగర్స్‌లో క్రషింగ్‌కు అడుగడుగునా అవినీతి, అవరోధాలు ఎందుకు ఎదురవుతున్నాయని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు వెంకట రమణ (కాసుబాబు) ప్రశ్నించారు. గోవాడ ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరకు క్రషింగ్‌కు తరచూ సాంకేతిక సమస్యలు ఎదురుకావడంలో ఉద్దేశమేమిటని నిలదీశారు. చెరకు గానుగాట ప్రారంభించి నెల రోజులు దాటినప్పటికీ లక్ష మెట్రిక్ టన్నులు గానుగాడ లేదని, ఫలితంగా లక్షల రూపాయల ఆదాయానికి గండి కొట్టారని ఆరోపించారు. ఇటు కార్మికులకు, ఇటు మీడియాకు సైతం వాస్తవాలు వెల్లడించడం లేదని మండిపడ్డారు. ఫ్యాక్టరీలో రెండు టర్బైన్‌లుండగా, గత నెల 28 నుండి విద్యుత్తు సరఫరా చేస్తున్నారన్నారు. ఫ్యాక్టరీ అవసరాలకు ఒకటి వినియోగించుకోగా, రెండవ టర్బైన్ నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్తును ఏపీ ట్రాన్స్‌కోకు అమ్ముతుంటారని, ఐదు రోజులుగా ఒక టర్బైన్ మరమ్మతులకు గురి కావడంతో ట్రాన్స్‌కోకు విద్యుత్ సరఫరా నిలిపివేశారన్నారు. దీంతో రోజుకు నాలుగు లక్షల రూపాయిల మేర ఆదాయానికి గండి పడిందని తెలిపారు. అవసరమున్నా లేకపోయినా యంత్ర పరికరాలు కొనుగోలు పేరుతో కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. గోనె సంచి నుండి రైతాంగానికి సబ్సిడీపై అందజేసే ఎరువులు, పురుగుమందుల వరకు కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయన్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో లక్షలాది కార్మిక, కర్షక కుటుంబాలు దీనిపై ఆధారపడుతున్నారని, ఫ్యాక్టరీపై అపనమ్మకంతోనే రైతాంగం ఈ యేడాది చెరకు సాగు విస్తీర్ణం తగ్గించినట్లు చెప్పారు. అయినప్పటికీ ఫ్యాక్టరీ యాజమాన్యం, అధికారులు చేతివాటం మానలేదన్నారు. ఫ్యాక్టరీలో జరుగుతున్న అవినీతిపై సీబీసీఐడీ విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని, చెరకు రైతుల సొమ్ము తిరిగి వసూలు చేయాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ఎన్నికల బడ్జెట్ అవుతుందా

పార్లమెంట్ ఎన్నికలు జరగడానికి ముందు తుదిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ఎలా ఉండబోతున్నది చర్చనీయాంశం. ఆర్థిక అసమానతలు అపారంగా పెరగడం, పేదరికం, నిరుద్యోగం రోజురోజుకీ అధికమవుతున్న దశలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఇంతకాలం అనుసరిస్తున్న కార్పొరేట్ల అనుకూల విధానాలు మారతాయా అన్నది పరిశీలించవలసి ఉంది. ఈసారి అధికార కేంద్రీకరణ దిశగా మోదీ ప్రభుత్వ బడ్జెట్ విధానాలు ఉండవచ్చునన్న సంకేతాలున్నాయి. 9 అసెంబ్లీలకు ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలున్నందున ఇది ఎన్నికల బడ్జెట్ కావచ్చు. అలాగే మధ్యతరగతి ప్రజల అనుకూల బడ్జెట్ ఉండవచ్చునని ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఇటీవల మాట్లాడిన తీరు అనిపిస్తోంది. మధ్యతరగతి వారి కష్టాలు తనకు తెలుసునని తాను కూడా మధ్యతరగతికి చెందిన వ్యక్తినని అన్నారు. అంటే మధ్యతరగతి పట్ల శ్రద్ధ వహిస్తారా? అలాగే ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం, ప్రైవేటీకరణ వేగవంతం లాంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. ఎందుకంటే మోదీ ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా అనుసరిస్తోన్న విధానాలే ఇవి గనుక. బీజేపీ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లను స్ఫూర్తిగా తీసుకొని ఈసారి బడ్జెట్‌ను రూపొందించనున్నారని ఆర్థికమంత్రి ఇప్పటికే పరోక్షంగా సూచించారు. ఈ విధానాలు అణగారిన వర్గాల, దిగువ మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలను తగ్గించి సంపన్నుల ఆదాయాలను అపారంగా పెంచాయి. ఫలితంగా పేదరికం గత 25 ఏళ్లలో ఏనాడు లేనంతగా మిక్కుటమైంది. ప్రస్తుతం 35కోట్లమంది పేదరికంలో మగ్గ తున్నారని దావోస్ సదస్సులో విడుదల చేసిన ఆక్స్‌ఫామ్ అధ్యయన నివేదిక వెల్లడించింది. ప్రపంచంలో అన్ని దేశాల కంటే ఎక్కువగా పేదరికం, నిరుద్యోగం పెరుగుతోందని ఆ నివేదిక స్పష్టం చేసింది.

మోదీ ప్రభుత్వం గత మూడేళ్ల బడ్జెట్లు సూత్రబద్ధంగా చూస్తే కోవిడ్ మహమ్మారి బడ్జెట్లు. ఈ మూడేళ్లలో కోవిడ్ వైరస్ నుండి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఆరోగ్యరంగంపైన అణగారిన ప్రజలు, సామాన్యులు, దిగువ స్థాయిలో జీవిస్తున్న వారిని కాపాడేందుకు అధిక నిధులు ఖర్చు చేయవలసి ఉండిందని, అయితే అభివృద్ధి సాధన పేరుతో ప్రభుత్వ నిధులను ఖర్చు చేసిందని, సెంటర్ ఫర్ ఎకనామిక్స్ స్టడీస్ (ఆర్థికరంగ అధ్యయన కేంద్రం) విభాగం ఇన్ఫోస్ఫియర్‌బృందం తన అధ్యయనంలో తెలిపింది. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రైవేటురంగం చాలా తక్కువగా పెట్టుబడులు పెట్టడం, ఖర్చు చేయడం అందరికీ తెలిసిందే. 2016 నుండి భారతదేశ వృద్ధి మందగమనంగా ఉంది. ఆకస్మికంగా పెద్దనోట్ల రద్దు, కరోనా మహమ్మారి విజృంభణ లాంటి షాక్‌లను దేశ ప్రజలు అనుభవించారు. ఆర్థికరంగం కుదేలైంది. దీంతో వృద్ధి మాంద్యం ఏర్పడింది. వీటికి తోడు అధిక నిరుద్యోగం, అసంఘటితరంగం దిగజారిపోవడం, మహిళలకు, పిల్లలకు అమలుచేస్తున్న, అలాగే పౌష్టికాహారం లోపాలున్న వారికి సహాయం లాంటి పథకాలకు కేటాయింపులు దారుణంగా తగ్గిపోయాయి. సామాజిక సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేసింది మోదీ ప్రభుత్వం. ప్రైవేటు రంగం తగినన్ని నిధులను పెట్టుబడులు పెట్టి అన్ని రంగాలలో మంచి ఉద్యోగాలను సృష్టించడంలో మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. అటు సంక్షేమం, ఇటు వృద్ధి చతికిలపడ్డాయి. ప్రైవేటు రంగం ఆస్తులను పెంచుకొనేందుకు బీజేపీ ప్రభుత్వం తోడ్పడింది. ఇదే సమయంలో ప్రణాళికాబద్ధమైన, ప్రణాళికరహిత వ్యయాలమధ్య అపారమైనతేడాలు చోటు చేసుకున్నాయి.

ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి భారతదేశంలో ఆర్థిక అసమానతల నివేదికను 2022 విడుదల చేసింది. ఆరోగ్యం, విద్య, ఇంటి పరిస్థితులు, కార్మిక మార్కెట్ తదితర రంగాలలో అసమానతలు అధికంగా ఉన్నాయని, దీని ఫలితంగానే బహువిధ పేదరికం వివిధ తరగతుల ప్రజల జీవనాన్ని కల్లోలపరుస్తున్నదని నివేదికలో ప్రధానమంత్రి మోదీని హెచ్చరించింది. అయినప్పటికీ ప్రధానమంత్రి ప్రకృతి విధ్వంసక, ఉద్యోగాల సృష్టిలేని అభివృద్ధిబాటను నేటికీ విడిచిపెట్టలేదు. అత్యధిక పేదరికాన్ని సృష్టించడంలో మోదీ నాయకత్వంలోని బీజేపిప్రభుత్వం "ఎంతో పురోగతిని" సాధించింది. ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం 2021లో సగటున రోజుకి 115మంది దినసరికూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. కరోనా మహమ్మారికాలంలో ఆర్థికమాంద్యం, అధిక ద్రవ్యోల్బణం కారణంగా కోట్లాది కుటుంబాలు అప్పుల పాలయ్యాయి. ఆనాటి సంక్షోభ పరిస్థితుల నుండి ఇంకా సామాన్య ప్రజలు కోలుకోలేదు. 2022 జూన్ చివరి నాటికి కుటుంబాల అప్పు రూ.35.2 ట్రిలియన్లకు చేరిందని ఆర్‌బిఐ నివేదిక స్పష్టం చేసింది. అధిక వడ్డీరేట్లు, పెరుగుతూనే ఉన్న ద్రవ్యోల్బణంతో పేదల దుస్థితి మరింత ఆగాధంలో పడిపోయింది. మరోవైపు కుబేరులు, ధనికులు మరింతగా సంపదపరులయ్యారు. పేదరికాన్ని మోదీ ప్రభుత్వం అసలు అంగీకరించకపోవడం మరింత విషాదం. గత రెండేళ్ల కాలంలో కొత్తగా అనుసరిస్తున్న పన్ను విధానం వల్ల రూ.1.84 లక్షల కోట్లు నష్టం వచ్చింది. సంపన్నులకు పన్ను తగ్గించడం, వ్యక్తులపై పన్నుభారం మోపడం జరిగింది. కార్పొరేట్ పన్నుల వసూళ్లు దాదాపు 16శాతం తగ్గిపోయి నష్టాలువచ్చాయి. క్రమంగా పన్నులభారం సామాన్యుల పైకి మళ్లింది. కార్పొరేట్లకు అపార లాభాలు సమకూరాయి. ద్రవ్యోల్బణం పెరుగుదల సంపన్నుల కంటే పేదలకు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది.

ఈ నేపథ్యంలో సామాన్యులకు, పేదలకు ఆదాయాన్ని పెంచినట్లయితే కొనుగోలు శక్తి పెరిగి ప్రభుత్వానికి ఆదాయం అధికమవుతుంది. పేదరికం తగ్గుతుంది. తద్వారా అసమానతలూ తగ్గుతాయి. అలాగే సంపన్నులు, కుబేరులపైన పన్నులు పెంచడం ప్రభుత్వానికి ఆదాయం పెరిగి సామాజిక కార్యక్రమాలను అధికంగా అమలు చేయడానికి అవకాశం కలుగుతుంది. ఎన్నికలే తమ లక్ష్యంగా పెట్టుకున్న మోదీ, అమిత్‌షాలు జన సామాన్యాన్ని పట్టించుకోకుండా ఇంకా ఎక్కువమంది కుబేరులను తయారుచేస్తుంటే సామాజిక అలజడులు పెరగవచ్చు. ప్రభుత్వం నిజంగా జనరంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా పేదరికం మరింత పెరగకుండా నివారించవచ్చు.

కొత్త నాయకులు కావాలి

రా బావ పండుగ బాగా జరిపావ. కొడుకు, కోడలు,పిల్లలు వచ్చారా. ఎవరూ రాలేదు బావ. వాడు అత్తవారింటికి వెళ్లాడు. నువు అదృష్టవంతుడవు. ఇద్దరు కూతుళ్లు, అల్లుళ్లు, పిల్లలు ఎంత సంతోషం. నిజమే పిల్లలు పుట్టకు ముందు ఇద్దరమే... చివరకు మిగిలేది యిద్దరమే. ఇటువంటి పడుగలకు కనీసం సంవత్సరానికి ఒక సారైనా అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేయడం పిల్లలతో కథలు జెప్పుకుని ఆడుకోవడం మనసుకు చెప్పలేని ఆహ్లాదం కల్గిస్తుందనుకో. నిజమే బావ నాకు ఆడపిల్లలు లేనిలోటు ఇటువంటి పండుగలలో స్పష్టంగా కనబడుతుందనుకో. అంతేకాదు, మగపిల్లలు తండ్రి ఆస్తులు లెక్కపెడితే, ఆడపిల్లలు తల్లిదండ్రుల ఆరోగ్యం గురించి ఆలోచిస్తారు. అదొకటే కాదు, ఆడపిల్లలు తల్లి చాటున ముఖ్యంగా తల్లి పెంపకంలో పెరుగుతారు. సంసారాన్ని తీర్చిదిద్దే తల్లి ఎంత కష్టపడుతుందో స్వయంగా చూస్తారు. అది సరేగాని మన దేశం రాను రాను అగ్నిగుండంగా మారనుందా అనే అనుమానం కలుగుతోంది బావ. అదేంటి అంతమాట అనేశావు. నిజమే మరి బీజేపీ వారు విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ వారిని అనుసరించి మాట్లాడిన మాటలు వింటుంటే అలా అనిపిస్తోంది. అన్ని కోట్లు ఖర్చు చేసి రామ మందిరం కట్టడంతో ప్రజలు విజ్ఞానవంతులై అభ్యుదయవాదులవుతారా. మతమౌఢ్యంలో కూరుకుపోతున్నారు. ఒక దేశంలో ఒకే మతం ఉండాలంటే ఎలా సాధ్యం బావ. రానురాను మనువును ముందుకుతెస్తే మతపిచ్చితో

అల్లర్లు జరిగి జాతి నాశనమవడం తప్ప ఏముంది. ఇప్పుడున్న నాయకుల స్థానంలో కొత్త నాయకులు వస్తే తప్ప, సమాజం అభివృద్ధిపథంతో అభ్యుదయంవైపు నడవదు బావ. నిజమే పార్టీ రహిత ప్రజాస్వామ్యంవస్తే తప్ప అందరికి న్యాయం జరగదు. ప్రస్తుతం ఏ పార్టీ అధికరంలోఉంటే ఆ పార్టీ వారికే న్యాయం జరుగుతుందనే అపవాదు అన్ని పార్టీలపై ఉంది. అది సరే బావ నీవు కొత్త నాయకులు రావాలంటు న్నావుగద వస్తున్నారు. వారంతా ఒక పార్టీ యిచ్చిన ట్రయినింగు పూర్తి చేసుకుని వస్తున్నారు. చిలకకు ఎలా నేర్పితే అలా పలుకుతుందన్నట్లు ప్రస్తుతం ఉన్న పెద్ద పార్టీలవారే కొత్త నాయకుల్ని తయారుచేస్తున్నారు. నిజమే బావ అవినీతికి అలవాటుపడ్డ నాయకులను చూడు వారి అనుచరగణం అలాగే ఫాలో అవుతుంది. కిందనుండి పైవరకు నాయకు లంతే. ప్రజల్లో తిరుగుబాటు వస్తుందని గమనించి కొత్త అనుచరుల్ని తయారు చేసుకుంటున్నారు. అదేంటివారు మాత్రం ఫాలో అవ్వరా నిజమే బావ కొంత సమయం పడుతుంది. ఈ లోపల కావలసినంత సంపాదించుకుంటారు. ఆ తరువాత ప్రభుత్వం మారినా సంపాదించిన సొమ్ముతో తరతరాలు అనుభవిస్తారు కదా. ఆ సొమ్ము ఓటర్లపై విరజిమ్మి మరల అధికారం సంపాదిస్తారు. రాబోయే 20ఏళ్లలో దేశం ఎలా ఉండాలని దేశ ప్రగతిని అంచనా వేయాలి. అంతేగాక ఎన్నికల ముందే అయిదేళ్లలో ఏం చేయాలో ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పథంలో దేశాన్ని ముందుకు నడిపించగల్గిన నాయకులు అవసరంగాని ఇలా పెద్దల వరవడిలో, స్వార్థంతో రాజ్యమేలే నాయకులెందుకు బావ.

అది నిజమే అందరూ తిడతారని బైటకు అనలేదుగాని నాకు ఒక తలంపు వచ్చింది బావ. అదేంటంటే స్వార్థంతో ప్రతిదానికి నాకేంటి అనే ఆలోచనవల్ల సమాజం నాశనమవుతోంది. ఈ స్థితిలో వారిని మార్చడం ఎవరివల్లకాదు. జీవరాశి అంతా అంతమై, కొత్త జీవం ఏర్పడి ఆటవిక మానవ దశ నుండి మరల సమాజాన్ని సృష్టించుకుంటే తప్ప మార్పు రాదనిపిస్తోంది. నిజమే ప్రతి వ్యక్తి సమాజం మారాలంటాడు కానీ అనే వ్యక్తి మారడు. యింకెలా మారుతుంది బావ. ఎన్నికల ముందు బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు గాలికి వదిలేశారు. రెండు లక్షల కోట్ల ఉద్యోగాలు గాల్లో కలిసిపోతాయి. అలాచెప్పినవన్నీ ప్రజలు మర్చిపోయారనుకుని ఏమీ ఎరగనట్లు ప్రవర్తిస్తారు. ఇక మన యువత ప్రశ్నించదు. ఎవరూ ప్రశ్నించకపోతే వారికి తప్ప ఎవరికీ తెలియదుగ బావ. అదినిజమేకాని అనుసరించేవారు నాయకులను ప్రశ్నించ లేరుగ. అలా అయితే మార్పు ఎలా వస్తుంది బావ. అయ్యో నీవెక్కడున్నావు. అసలు మార్పు ఎవరికి కావాలి. నాయకులు వారి అనుచరులకు సంపాదనే కావాలిగాని సమాజంలో మార్పు అభ్యుదయం, సామాజిక అభివృద్ధి ఇవన్నీ వారికవసరంలేదు. వారికి అవసరమైంది సంపాదించుకోవడానికి అధికారం. స్వాతంత్ర్యం రాకముందు ఆంగ్లేయులను తిట్టిన నోటితోనే మన సహోదరులను తిట్టడానికి నోరు రావడంలేదు బావ. అది సరే కొత్త విషయం ఏమిటంటే సామాజిక వర్గం కోసమో, సంపాదన కోసమేగాని ఈ సారి ఎన్ఆర్ఐలు ఎన్నికలబరిలో కనబడతారుగ. ముందుకోట్లు గుమ్మరించి టికెట్లు కొనుక్కొని ఆ తర్వాత ఓటర్లకు నోట్లు విరజిమ్మి మంత్రులు కావడానికి ఉబలాటపడుతున్నారు బావ. కొత్త యువరక్తం అవసరం. గతంలో 60ఏళ్ల క్రితం కమ్యూనిస్టులు జరిపినట్లు మేధావులు ముందుకువచ్చి శిక్షణా తరగతులు జరిపి నిస్వార్థంగా జాతికోసం పనిచేసే కొత్త రక్తాన్ని తయారుచేయాలి. వారి నుంచి తయారైన కొత్త నాయకుల వలనే ప్రగతి సాధ్యం బావ. కనుక ఇప్పుడు దేశానికి కొత్త నాయకులు కావాలి.

సెల్: 98855 69394

కమ్యూనిస్టులు-మతం

సురవరం సుధాకరరెడ్డి

> మతంతో ఏర్పాటయ్యే దేశాలు అభివృద్ధి చెందకపోగా, మరింత నష్టపోతాయి. ఉదాహరణకు పాకిస్తాన్. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయింది. దుర్భర దారిద్ర్యంతో, ఆకలితో, నిరుద్యోగంతో, టెర్రరిస్టు హత్యలతో, దేశం దివాలా తీస్తున్నది. దాదాపు 40 సంవత్సరాలపాటు సైనిక పదఘట్టనల కింద నలిగిపోయింది. అఫ్గానిస్తాన్ మరింత దారుణంగా మతోన్మాదం, మూర్ఖ తాలిబన్ల చేతిలో బతుకుతున్నది. మతోన్మాదం ప్రజాస్వామ్యానికి, ప్రగతికి, విజ్ఞాన వికాసానికి, ఆఖరుకు సాధారణ విద్యకు వ్యతిరేకం. అందువల్లనే మతోన్మాదులకు వారి విద్వేష ప్రచారానికి యావన్మంది ప్రజలు పోరాడాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది.

మతంపై కమ్యూనిస్టుల వైఖరి కమ్యూనిస్టు సిద్ధాంతకర్తలు, విభిన్న సందర్భాలలో విపులంగా వివరించారు. హేతువాద వైఖరితో ఉండేవారుగా కమ్యూనిస్టులు, మతాన్ని విశ్వసించరు. విశ్వం-దాని అవిర్భావం గురించి, భూమి దాని పుట్టుక, జీవుల పుట్టుక, మనిషి రూపం వరకు రూపాంతరం చెందడానికి లక్షల సంవత్సరాల సుదీర్ఘ పరిణామక్రమంలాంటి విషయాలను అందరం చదువుకున్నాం. కానీ మతం మీద విశ్వాసం వేరు, సైన్సు వేరు, జీవితం వేరు అనుకుంటారు. చదువుకున్న సైన్సు విజ్ఞానాన్ని స్కూలు భవనంలోనే వదిలేస్తారు. మరికొందరు దేవుడి ఉనికిపై అనుమానమున్నా, ఎందుకైనా మంచిదని మొక్కులకు పోతుంటారు.

మతాలు ఆవిర్భవించినపుడు సైన్సు అభివృద్ధి కాలేదు. మానవ మేధస్సు ఆలోచించడం ప్రారంభించిన తర్వాత మానవజాతి పుట్టుక గురించి జిజ్ఞాస ప్రారంభమైంది. అంతకుముందు ప్రకృతి వైపరీత్యాలకు భయపడి ప్రకృతిని ఆరాధించడం ప్రారంభించారు. భయంతో రక్షణ కోసం ఆరాధించేవారు. ఆ తర్వాత సృష్టికర్త ఎవరో ఉన్నారనే ఆలోచన ప్రారంభమైంది. సృష్టికర్త భావన బలపడింది. దానిని ప్రచారం చేయడానికి మతం సృష్టించారు. 'మనుషులు చేసిన దేవుళ్లారా, దేవుడు చేసిన మనుషుల్లారా, అని ఒక పాపులర్ సినిమా ఉంది. ప్రపంచంలోని వివిధ ఖండాల్లో, వివిధ సందర్భాలలో భగవంతుడిని సృష్టించారు. దేవుడి రూపం అస్పష్టం. అనేక మతాలలో దేవుడి రూపాన్ని చిత్రించ నిరాకరిస్తారు. ఎవరైనా ప్రయత్నిస్తే ఆగ్రహిస్తారు. భారతదేశంలో వైదికమతంలో మానవరూపంలో భగవంతుడిని ఆరాధించడం ప్రారంభమైంది. భగవంతుల సంఖ్య పెరగడం ప్రారంభమైంది. 3కోట్ల మంది దేవతలు, 33కోట్ల దేవతలు, దేవతల రాజ్యం వారి రాజు దేవేంద్రుడు, స్వర్గం,నరకం, తదితరాల సృష్టి జరిగింది. మతం మీద, దేవుడిమీద నమ్మకంలేని వారిని భయపెట్టడానికి, విశ్వాసమున్నవారిలో మరింతగా విశ్వాసం బలోపేతం చేయడానికి వీటిని సృష్టించారు. దుర్మార్గాన్ని, అరాచకత్వాన్ని భయపెట్టడానికని కొందరంటారు. హంతకులు, దొంగలు, హింసాప్రవృత్తి కలవారు, యుద్ధాలు చేసేవారు దేవుడికి మొక్కి తమ పని విజయవంతం కావాలని మొక్కులు చెల్లిసారు. జూదగాళ్లు తాము గెలవాలని దేవుడిని కోరుకుంటారు. దేవుడికి అర్పణ పేరుతో టెంకాయల నుండి బంగారం దాకా చెల్లిస్తారు. ఈ ప్రపంచమే దేవుడు సృష్టించాడని నమ్మేవారు, దేవుడికి కానుకలెందుకని ఒక క్షణం ఆలోచించరు. దేవుళ్ల పేర్లు వివిధప్రాంతాల్లో వివిధ రూపాల్లో ఉన్నట్లే, రూపాలు కూడా మారుతాయి. మానవరూపంలో శిలావిగ్రహాలు, ఒడిశాలోని పూరిలో 12 సంవత్సరాలకొకసారి మార్చే చెక్క విగ్రహాలు ఉంటే, ఆదివాసీలకు సంవత్సరానికొకసారి వచ్చే పండుగకు ఆలయంలేని చెట్టు క్రింద, రాళ్లు పెట్టి, పసుపురాసి ప్రార్థించి జాతర చేసిపోతారు. వీరు కాక దక్షిణ భారతదేశంలో ప్రతిగ్రామంలో గ్రామదేవతలుంటారు. వీరికి స్థానిక బహుజనులనుండే పూజారులుంటారు. వైదికమతంలో బ్రాహ్మణులే పూజారులు. ఇస్లాంలో ఇమామ్‌లుంటారు. క్రైస్తవ మతంలో ఫాదర్‌లు వీరందరిపైన పోప్ ఉంటారు. క్రమంగా మతాలు బలోపేతమైనాయి. మత గురువులు, రాజులు పరస్పర మద్దతుదారులు తమ మతమే ప్రపంచమంతా విస్తరించాలని యుద్ధాలు జరిగాయి. లక్షలాదిమంది మరణించారు. నిజంగా భగవంతుడు సర్వశక్తిమంతుడైతే, అన్ని దేశాలలో ఒకే మతం ఉండాలి. కొన్ని కొన్ని దేశాలకు ఒక మతం-దేవుడు ఎందుకు పరిమితమౌతాడు? ఈ ప్రశ్నలడుగితే హేతుబద్ధమైన సమాధానాలివ్వలేక ఆగ్రహిస్తాడు. దాడులు చేస్తారు. అవిశ్వాసుల తలలు నరుకుతారు.

మార్క్స్ "మతం అణచివేతకు గురైన బాధాసర్పదష్టులైన ప్రజలకు ఓదార్పు-నిట్టూర్పు". దానితో ప్రారంభమై 'మతం మత్తుమందుగా మారుతుంది' అన్నాడు. మతం ఒక భ్రమపూరిత జలతారుతెర. కమ్యూనిస్టులు హేతుబద్ధంగా, చైతన్య పూరితంగా ఆలోచిస్తారు కనుక మతాన్ని విశ్వసించరు. నిరాకరిస్తారు. దేవుడి గురించి, చెప్పని మతాలు కొన్ని ఉన్నాయి. అందులో బౌద్ధం ముఖ్యమైనది. యజ్ఞయాగాదులు లేని, లక్షల పశువుల బలికాకుండా ఉండే సమాజాన్ని, కుల, మత భేదాలు లేని సమాజాన్ని వాంఛించింది. చైనా, శ్రీలంక, భూటాన్, సిక్కిం, జపాన్, థాయ్‌లాండ్, ఉత్తరకొరియా, దక్షిణకొరియా, వియత్నాం తదితర ఆసియా దేశాలలో అత్యధికులు బౌద్ధులే. మతాన్ని విశ్వసించడం, దానిలోని లొసుగులు వివరించడం వేరు. మత అనుయాయులను ద్వేషించడం వేరు. కమ్యూనిస్టులు మతాన్ని విశ్వసించకపోయినా, మతాన్ని నమ్మేవారి విశ్వాసాన్ని వారి హక్కుగా గుర్తిసారు. అన్ని మతాలవారికి సమాన హక్కులుండాలని కోరుతారు. ఫలానా మతానికి అనుకూలం, ఫలానా మతానికి వ్యతిరేకం అనే ప్రసక్తి లేదు. మతం పేరుతో మోసగాళ్లను, ప్రజావంచకులను బహిర్గతం చేస్తారు.

అయితే కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరు మతం నుండి దూరంగా, వ్యతిరేకంగా ఉండాలనే నిబంధనలేదు. అలాంటి నిబంధన పార్టీ నిబంధనావళిలో చేర్చేందుకు లెనిన్ నిరాకరించారు. ప్రజలు చైతన్యం ద్వారా విజ్ఞాన వంతులు కావాలని ఆయన చెప్పారు. కమ్యూనిస్టులు మతోన్మాదాన్ని కచ్చితంగా వ్యతిరేకిస్తారు. అన్ని మతాలలో అత్యధిక ప్రజలు సాధారణ విశ్వాసులు. కొంతమంది వీర భక్తులు, మరికొంతమంది మతోన్మాదులు. సమస్య వీరితోనే. ప్రమాదం వీరితోనే. మతం ప్రమాదంలో పడిందని, ఇతర మతాలవారికి ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి జనాభా పెరిగి, మన జనాభా తగ్గుతుందని భవిష్యత్తులో వారే దేశంలో మెజారిటీ ఔతారని తప్పుడు ప్రచారం చేస్తారు. ప్రతి సమస్యను మత సమస్యగా ప్రజల మనసుల్లో విషం ఎక్కిస్తారు. మత ఘర్షణలకు కారణమౌతారు. మతోన్మాదంపేర, శవాలగుట్టలు పేర్చి ఆ మెట్ల మీద రాజ్యాధికారం పొందే ప్రయత్నం చేస్తారు. ఏ దేశంలోనైనా మెజారిటీ మతంలో మతోన్మాదం అత్యంత ప్రమాదకరం.

మతంతో ఏర్పాటయ్యే దేశాలు అభివృద్ధి చెందకపోగా, మరింత నష్టపోతాయి. ఉదాహరణకు పాకిస్తాన్. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయింది. దుర్భర దారిద్ర్యంతో, ఆకలితో, నిరుద్యోగంతో, టెర్రరిస్టు హత్యలతో, దేశం దివాలా తీస్తున్నది. దాదాపు 40 సంవత్సరాలపాటు సైనిక పదఘట్టనల కింద నలిగిపోయింది. అఫ్గానిస్తాన్ మరింత దారుణంగా మతోన్మాదం, మూర్ఖ తాలిబన్ల చేతిలో బతుకుతున్నది. మతోన్మాదం ప్రజాస్వామ్యానికి, ప్రగతికి, విజ్ఞాన వికాసానికి, ఆఖరుకు సాధారణ విద్యకు వ్యతిరేకం. అందువల్లనే మతోన్మాదులకు వారి విద్వేష ప్రచారానికి యావన్మంది ప్రజలు పోరాడాలని కమ్యూనిస్టు పార్టీ కోరుతుంది.

కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యం వర్గ దోపిడీకి వ్యతిరేకంగా, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ప్రజలలో శాస్త్రీయ విజ్ఞానాన్ని, చైతన్యాన్ని పెంపొందించడం. మతాన్ని నిందించడం కంటే హేతువాదాన్ని, శాస్త్రీయ విజ్ఞానాన్ని తద్వారా చైతన్యాన్ని పెంపొందించడం ముఖ్యం. ఈ మధ్య జరిగిన అంతర్జాతీయ సర్వేలో ప్రపంచంలో 110కోట్ల మందికి పైగా మతాన్ని నమ్మని వారున్నారని తేలింది. ఇది చాలా పెద్ద సంఖ్య. వీరు తమ చైతన్యం ద్వారానే ఈ వాస్తవాన్ని అంగీకరిస్తున్నారు. నేరుగా మతంపైన దాడిచేస్తే అది మరింత గట్టిపడుతుంది. దాని ద్వారా ప్రయోజనం నెరవేరదు. అంధకారాన్ని వెలుగుద్వారానే బద్దలు కొట్టగలం. నేరుగా దాడి చేయకూడదంటే మేము దానికి వ్యతిరేకంగా కాదనే ప్రకటనల ద్వారా, మతోన్మాదులు సంతృప్తి చెందరు. అది మన మానసికస్థాయి దిగజారుడు ఔతుంది. వారి ఉచ్చులో పడకూడదు. పార్టీలో నాస్తికులై ఉండితీరాలని నిబంధన లేదుకాబట్టి, మనం దేవాలయాలకు, యజ్ఞాలకు, మతపర కార్యకలాపాలకు భాగం వహించవచ్చే లైసెన్సు కాదు. కమ్యూనిస్టులు హేతుబద్ధంగా ఆలోచించి మతానికి, మతపర కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. సాధారణ కమ్యూనిస్టు సానుభూతిపరులు వేరు-పార్టీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు వేరు. ఒకసారి నాయకులు తప్పుచేస్తే అదొకసాకుగా, సాంప్రదాయకంగా మారుతుంది. అందువల్ల నాయకులు జాగ్రత్తగా ఉండాలి.

కమ్యూనిస్టుపార్టీ అధికారంలో ఉన్నప్పుడు సోషలిస్టు దేశాలలో కూడా మత స్వేచ్ఛ ఉంది. సోవియట్‌లో పాత చర్చిలు, కేథడ్రల్స్, అన్నీ అలాగే ఉండటమేగాక కొంతమంది ప్రార్థనలకు వెళ్లేవారు. బాహులో ఒక విశాలమైన మసీదును చూడటానికి వెళ్లాం. ఇమామ్‌తో కొంతసేపు చర్చించాం. మాకు స్వేచ్ఛ ఉందిగాని, కొత్త తరం ప్రార్థనలకు రారు. విరాళాలివ్వరు. పాతవాళ్లు వస్తారు అన్నారు. ఆయన ముని మనవడిని పరిచయం చేశారు. ఎంఎస్‌సి చదువుకున్నాడు. మీరు ప్రార్థనలుచేస్తారా అనిఅడిగాం. నేను సైన్సు విద్యార్థిని. నేను భగవంతుడి ఉనికినినమ్మను అన్నాడు. మత విశ్వాసం ఉన్న ఒక ముస్లిం మిత్రుడు 'ఇవన్నీ మీకుకాలేజిలో నూరిపోస్తారా' అని అడిగాడు. ఆ యువకుడు కోపంగా రోజూ స్నానం చేయాలని, శుభ్రంగా ఉండాలని పాఠ్యపుస్తకంలో ఉండదు. ఇదికూడా అలాంటిదే నన్నాడు. చైనాలో బౌద్ధఆలయాలు అందంగా, విశాలంగా ఉన్నాయి. అవి ఆరాధ్యస్థలాలే కాక, పెద్ద పర్యాటక కేంద్రాలుగా ఉన్నాయి. ఈ మధ్య కొందరు పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవాలయాలు, ఆశ్రమాలు దర్శించడం సరైందికాదు. అది అశేష వామపక్ష ప్రజానీకానికి మంచి సందేశం పంపదు. కమ్యూనిస్టులుగా చైతన్యం పెంచుకోండి.

సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి

ఆర్థిక అంతరాలు ప్రగతి నిరోధకాలు

ఇ-మెయిల్

తాజాగా విడుదలైన ఆక్స్‌ఫామ్ అంతర్జాతీయ నివేదిక లెక్కలు భారత్‌లో పెరుగుతున్న ఆర్థిక అసమానతల్ని పట్టి చూపిస్తున్నాయి. ఆ నివేదిక ప్రకారం ఒక్క శాతం సంపన్నుల చేతిలో నలభై శాతం దేశ సంపద కేంద్రీకృతమై ఉండగా, ఏభై శాతం ప్రజలు మూడు శాతం సంపదతో సరిపెట్టుకుంటున్నారు. కరోనా సంక్షోభ సమయంలో బిలియనీర్ల ఆదాయం 121శాతం పెరగగా, అధిక జనాభా ఆదాయంలో 13శాతం వృద్ధి మాత్రమే కనబడింది. పేదరికంలోకి కొత్తగా కోట్లాదిమంది జారిపోయారు. సంపన్నులకు ఇచ్చే పన్ను రాయితీ వల్ల లక్షల కోట్లు రావాల్సిన ఆదాయాన్ని భారత్ వదులుకుంది. అదే సమయంలో జీఎస్టీ పన్ను ద్వారా వచ్చిన ఆదాయంలో 66శాతం అధిక జనాభా జేబుల్లోంచి వచ్చింది. సంపన్నుల వాటా అందులో కేవలం 3శాతం. ఎన్నిరకాలుగా కూడికలు, తీసివేతలుచేసి ఏరకంగా తేల్చి చెప్పినా వాటి సందేశం ఒకటే. ఆర్థికఅంతరాలు పెరుగుతూ వస్తున్నాయి తప్ప తరగడం లేదు.

ప్రభుత్వ విధానాలు అందుకు సహకరిస్తున్నాయి తప్ప దిద్దుబాటు దిశగా లేవు. పన్ను రాయితీలు సంపన్నులకు, అదనపు వడ్డింపులు సామాన్యులకు తరహా విధానంతో సమాజంలో పేదరికం పెరుగుతోంది. ఆక్స్‌ఫామ్ లెక్కలు పాక్షిక సత్యమే అనుకుందాం. అలా అని ఏ అధికారిక గణాంకాలు తీసుకున్నా ఆర్థిక సమానత్వం వైపు అడుగులేస్తున్నట్లు కనబడడం లేదు. ఆహార భద్రత, పౌష్టికాహార లభ్యత, నిరుద్యోగం, రోజువారీ సగటు ఆదాయం ఇలా ఏ మానవాభివృద్ధి సూచికలు తీసుకున్నా గొప్పగాలేవు. మరోవైపు స్థూల ఆర్థికంలో బ్రిటన్‌ని తలదన్ని ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థికశక్తిగా భారత్ నిలిచింది.

డా.డి.వి.జి.శంకరరావు, సెల్:94408 36931

మోదీ పాలనలో బ్యాంకుల మోసాలు రెట్టింపు

డా.జ్ఞాన్ పాఠక్

బీజేపీ నాయకత్వంలోని ప్రధాని నరేంద్ర మోదీ ఎనిమిదేళ్ల పాలనాకాలంలో బ్యాంకు మోసాలు రెట్టింపయ్యాయి. పన్నెండు లక్షల కోట్ల రూపాయలకుపైగా రుణాలు తీసుకున్నవారు, బ్యాంకు అధికారులు మోసాలకు పాల్పడ్డారు. న్యాయ, అక్రమ మార్గాల ద్వారా భారత ఆర్థికరంగాన్ని ఒక పథకం ప్రకారం వీళ్లు దోచేశారు. ఈ మోసాలకు రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం కారణమైనప్పటికీ అంగీకరించరు. 2013-14 నుంచి 2021-22 వరకు మొత్తం మోసాల సంఖ్య 4,306 నుంచి 9,103 దాకా పెరిగిపోయాయి. 2022-23లో ఆర్థికమోసాలు ఇంకా పెరగనున్నాయి. 2014లో మోదీ అధికారంలోకి రాకముందు 11వందల మోసాల కేసులుండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో అవి 5,406కు ఎగబాకాయి. గత ఏడాది తర్వాత మోసాలకేసులు మరో 4,069కి చేరాయి. గత ఏడాది డిసెంబరులో పార్లమెంటులోనే బ్యాంకులు రద్దుచేసిన మొత్తం 2021-2022 ఆర్థిక సంవత్సరానికి 11.17 లక్షల కోట్లుగా ఆర్థికమంత్రిత్వ శాఖ వెల్లడించింది. గడచిన ఆరు ఆర్థిక సంవత్సరాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు కలసి మొత్తం రూ.8,16,421లను బ్యాంకులు రద్దుచేసినట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ఆ తర్వాత బ్యాంకులు రద్దు చేసిన మొత్తాలు రూ.11,17,883 కోట్ల రూపాయలు ఉన్నాయని రిజర్వు బ్యాంకు వెల్లడించింది. పైగా రద్దు చేసిన బకాయిలకు నిరర్థక ఆస్తులంటూ ముద్దుపేరు పెట్టుకున్నారు. ఫలితంగా బ్యాంకు పుస్తకాలలో ఈ అప్పులు కనిపించవు. బకాయిలపై చెల్లించవలసిన పన్నులు కూడా నష్టపోయినట్టే.

ఈ అంశాలన్నింటినీ ఆర్థికశాఖ రాతపూర్వకంగా వెల్లడించింది. అయితే మోసగించిన బడాబాబులు ఎవరైందీ ఈ దేశప్రజలకు తెలియకుండా ప్రభుత్వం దాటేసింది. అంటే ప్రజలకు ఏమాత్రం ప్రభుత్వం జవాబుదారీ తనం లేదన్నది స్పష్టమైపోయింది. కొంతమంది లక్షలు, మరికొందరు వేలకోట్ల రూపాయలు అప్పు తీసుకొని, ఎగవేసి విదేశాలకు పారిపోయారు.



దాదాపు 80మంది బ్యాంకులను మోసగించిన కుబేరులపై అనేక దేశాల్లో విచారణ జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. లుక్‌ఫుట్ నోటీసులు ఇవ్వడానికి విదేశాల్లో కోర్టులకు హాజరై వాదించడానికి న్యాయవాదులకు, దర్యాప్తు అధికారులకు కోట్ల రూపాయాలు ఖర్చు చేయవలసివస్తోంది. రుణాలు తీసుకున్న వారినుంచి వసూలు చేయడానికి ప్రభుత్వం, ఆర్‌బీఐ బాధ్యతలేకుండా వ్యవహరించాయి. ఇందులో కావాలని బకాయిలు ఎగవేసిన వారు లక్షలకోట్ల రూపాయలు వెనకేసుకుని పారిపోయారు. వీరికి ఉన్నత స్థాయిలో ఉన్నవారు విదేశాలకు పారిపోవడానికి కూడా సహకరించారని వార్తలు వచ్చాయి. లోక్‌సభలో ఆర్థికశాఖఇచ్చిన రాతపూర్వక సమాధానంలో, కావాలని అప్పులు ఎగవేసినవారు ఒక్కొక్కరు 25లక్షలు, ఇంకా ఆపైన చెల్లించవలసిన మొత్తాలు 2022 జూన్ నాటికి ఉన్నాయని తెలియజేసింది. కావాలని 25లక్షలు ఆపైన రుణాలు ఎగవేసినవారి జాబితాను రుణ సమాచార కంపెనీల వెబ్‌సైట్స్‌లో అందుబాటులో ఉన్నాయని, అయితే కోర్టులో కేసులు వేయడంతో ఇవి వెలుగు చూశాయని వెల్లడైంది. కోర్టుకెక్కని కేసులకు సంబంధించిన మోసకారుల జాబితాను గుప్తంగానే ఉంచారు. ఆ జాబితాను ప్రకటించడానికి కేంద్ర ఆర్థికశాఖ సుముఖంగా లేదు. బ్యాంకు మోసాలపైన విచారణకోసం సుప్రీంకోర్టులో సుబ్రహ్మణ్యస్వామి కేసు దాఖలు చేశారు. ఆయన తన పిటిషన్‌లో ఆర్‌బీఐ అధికారులు మోసకారులతో కుమ్మక్కు య్యారని, రిజర్వు బ్యాంకు చట్టాల ఉల్లంఘనలకు పాల్పడ్డారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇటీవల కోర్టుకు హాజరైన ఆర్‌బీఐ అధికారులు, తమ పాత్ర ఏమీలేదని స్వతంత్రంగా ఏర్పాటుచేసిన బ్యాంకులు ఎక్కువగా రుణాలను మంజూరు చేయడానికి బాధ్యులని ఆర్‌బీఐ తెలిపింది. 2014-15 నుంచి 2020-21 వరకు ఏడేళ్లకాలంలో మోసకారులు చెల్లించవలసిన రుణాలు 1.7లక్షల కోట్లకు చేరుకున్నాయని, వాటిని రద్దుచేశారని ఆర్‌బీఐ తెలిపింది. వీరిలో అత్యధికభాగం బ్యాంకులను మోసంచేసి పారిపోయినవారున్నారు. ఆ తరువాత సంవత్సరంలో బ్యాంకులు 2,02,780 కోట్ల రూపాయలను రద్దు చేశారు. ఆర్‌టిఐ చట్టం కింద వేసిన దరఖాస్తుకు సమాధానంగా, ఆర్‌బీఐ 2021 డిసెంబరునాటికి 11,68,095 కోట్ల రూపాయలను రద్దు చేసినట్లు ఆర్‌బీఐ తెలియజేసింది.

బ్యాంకులకు బకాయిలు ఎగవేసినవారిలో ఎక్కువమంది బడా కార్పొరేట్లు, పాలకుల ఆశ్రితులు ఉన్నారు. అంతర్జాతీయంగా అంగీకరించిన నియమంప్రకారం, 1-2శాతం మాత్రమే బ్యాంకులకు చెల్లించవలసిన రుణాలు మిగిలిఉంటాయి. ఈ మోసాల నుంచి బ్యాంకులు ఇంకా బైటపడ లేదని 2022 డిసెంబరు 29న, ఆర్‌బీఐ ఆర్థిక సుస్థిరత నివేదిక వెల్లడించింది. 2023సెప్టెంబరు నాటికి ప్రభుత్వరంగ బ్యాంకులకు చెల్లించ వలసిన బకాయిలు మరో9.4శాతం పెరగవచ్చునని ఆ నివేదిక వెల్లడించింది. అయితే ఈ వివరాలను తిరస్కరించిన రాజ్యసభ సభ్యుడు జవహర్ సర్కార్ షెడ్యూల్, కమర్షియల్, వాణిజ్య బ్యాంకులలో రుణ బకాయిల మొత్తం 2014-15 నాటి నుంచి 2021-22 వరకు 66.5లక్షల కోట్లు ఉంటుందని ఆర్థికశాఖ పార్లమెంటులో చెప్పిన సమాధానాల ఆధారంగా తాను లెక్కవేశానని చెప్పారు. అలాగే 2022 మార్చి 31నాటి ఆర్థిక సంవత్సరం చివరి మూడునెలల కాలంలో రద్దుచేసిన బకాయిలు 14.5లక్షల కోట్ల రూపాయలు ఉండవచ్చునని కూడా ఆర్థికశాఖ వెల్లడించింది.

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌ను తొలగించాల్సిందే

రెజ్లర్ల డిమాండ్

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (WFI) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా దేశ అగ్రశ్రేణి రెజ్లర్లు చేపట్టిన ఆందోళన రెండో రోజూ కొనసాగింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా, సాక్షి మలిక్, సంగీత ఫొగాట్ సహా అనేకమంది క్రీడాకారులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పునియా మాట్లాడుతూ.. "ఈ దేశం కోసం మేం పోరాడుతున్నప్పుడు.. మా హక్కుల కోసమూ పోరాడుతాం" అని తెలిపాడు. బ్రిజ్ భూషణ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించే వరకు ఈ ఆందోళన విరమించబోమని స్పష్టం చేశాడు.

మధ్యవర్తిగా బబితా ఫొగాట్

మరోవైపు, మరో రెజ్లర్, బీజేపీ నాయకురాలు బబితా ఫొగాట్ ప్రభుత్వం తరఫున మధ్యవర్తిగా గురువారం ధర్నా ప్రాంతానికి వచ్చి రెజ్లర్లతో మాట్లాడారు. 'అథ్లెట్లకు ప్రభుత్వం మద్దతుగా ఉంది. ఈ సమస్యను ఈ రోజే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నా' అని బబిత తెలిపారు. మరోవైపు ఆందోళన చేస్తోన్న రెజ్లర్లకు ప్రతిపక్ష రాజకీయ ప్రముఖులు మద్దతు తెలిపారు. బ్రిజ్ భూషణ్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నాడని, రెజ్లర్లపై అసభ్య పదజాలాన్ని వాడాడని ఆరోపించిన విషయం తెలిసిందే. అంతేగాక, ఆయన చాలా ఏళ్లుగా మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడని వినేశ్ ఫొగాట్ ఆరోపించింది. లక్నోలోని జాతీయ శిబిరంలో అనేక మంది కోచ్‌లు మహిళా రెజ్లర్లను లైంగిక దోపిడీ చేశారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఈ ఆరోపణలు పెను వివాదానికి దారితీశాయి.

కమిటీ యోచనలో కేంద్రం

బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర క్రీడల శాఖ స్పందిస్తూ.. 72 గంటల్లోగా వివరణ ఇవ్వాలని డబ్ల్యూఎఫ్ఐని ఆదేశించింది. వివరణ ఇవ్వకపోతే జాతీయ క్రీడా నియమావళి ప్రకారం సమాఖ్యపై చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే లైంగిక వేధింపుల ఆరోపణలపై దర్యాప్తు చేపట్టేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిలో ఇద్దరు మహిళా సభ్యులు ఉండనున్నట్లు తెలుస్తోంది.

అనురాగ్ ఠాకూర్‌కు బ్రిజ్ భూషణ్ ఫోన్

ఇదిలా ఉండగా.. సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ గురువారం కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌కు ఫోన్ చేశారు. రెజ్లర్లు చేస్తోన్న ఆరోపణలపై ఆయన కేంద్రమంత్రికి వివరణ ఇచ్చినట్లు సమాచారం. బీజేపీ ఎంపీ అయిన బ్రిజ్ భూషణ్ 2011 నుంచి డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష పదవిలో ఉంటున్నారు. 2019 ఫిబ్రవరిలో మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

ప్రధాని మాట్లాడరేం: కాంగ్రెస్

ప్రధాని నరేంద్రమోదీ ఈ ఘటనపై మౌనం వీడి, తక్షణమే మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వద్రా ట్వీట్ చేశారు. 'మన దేశానికి ఆటగాళ్లు గర్వకారణం. ప్రపంచస్థాయిలో తమ సత్తా చాటి దేశానికి పతకాలు తెస్తున్నారు. రెజ్లర్లందరూ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిపై ఆరోపణలు చేస్తున్నప్పుడు వినాలికదా' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'మహిళల పట్ల బీజేపీ నాయకులు దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి' అని ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రధాని గారూ... మీరు చెప్పే 'బేటీ బచావ్' నినాదం... అంటే బీజేపీ నేతల నుంచి కుమార్తెలను కాపాడుకోమనేగా' అని ఎద్దేవా చేశారు. 'మీరు ప్రసంగిస్తూ చెప్పారుగా క్రీడలకు మంచి సానుకూల వాతావరణ అందించాలని, 'మంచి సానుకూల వాతావరణం' అంటే ఇదేనా? అని ప్రశ్నించారు.

తక్షణమే బ్రిజ్ భూషణ్‌ను తొలగించాలి: సమాజ్‌వాదీ పార్టీ

ఆటగాళ్లపై లైంగికదాడులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే తొలగించాలని సమాజ్‌వాదీ పార్టీ డిమాండ్ చేసింది. ఎస్పీ అధికార ప్రతినిధి సునీల్ సింగ్ సజన్ మాట్లాడుతూ 'దేశానికి పతకాలు తీసుకొస్తున్న మహిళా క్రీడాకారులపై ఈ విధమైన లైంగిక దాడి అంటేనే మనసు చలించిపోతోంది. కేవలం రెజ్లింగ్‌లోనే కాదు, ఇతర క్రీడల్లోనూ మహిళలు ఈ ఘటనపై ముందుకొచ్చి నిరసన తెలపాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. 'అందువల్ల నేను ప్రధానిని కోరేదేమంటే... తక్షణమే బ్రిజ్ భూషణ్‌ను ఆ పదవి నుంచి తొలగించాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. సరైన క్రమంలో విచారణ చేపట్టాలి. ఇలాంటి లైంగిక వేధింపుల కేసుల్లో ఎక్కువగా బీజేపీ నేతలు ఉండటం నాకు ఆశ్చర్యాన్ని కలగజేస్తోంది' అని పేర్కొన్నారు.

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ రాజీనామా చేయాలి: ఎన్‌సీపీ

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తక్షణమే తన పదవి నుంచి తప్పుకుని రాజీనామా చేయాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. 'దేశానికి పతకాలు తీసుకొచ్చిన మహిళా రెజ్లర్‌లు అంతా ప్రస్తుతం జంతర్‌మంతర్ వద్ద తమకు న్యాయం కావాలని డిమాండ్ చేస్తూ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. వారికి తక్షణమే న్యాయం చేయాలి' అని ఎన్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి క్లైయిడ్ క్రాస్టో డిమాండ్ చేశారు. 'రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కూడా ఓ మెట్టు దిగాలి. తక్షణమే విచారణ చేపట్టాలి. ఒకవేళ ఆయన ఆ పదవిలో కొనసాగితే విచారణపై ఆయన ప్రభావం చూపించే అవకాశం ఉంటుంది' అని క్రాస్టో పేర్కొన్నారు.

విపక్షాల ఐక్యతే నా కల: నితీశ్

పాట్నా: ప్రతిపక్ష నేతలంతా ఏకమవ్వాలన్నదే తన కల అని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ చెప్పారు. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి సమావేశానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్, కొన్ని ప్రాంతీయ పార్టీల నేతలు హాజరయ్యారు. బహిరంగసభ విజయవంతం కావడంపై నితీశ్‌కుమార్ గురువారం స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకంటూ ప్రత్యేకంగా కోరికలేమీ లేవని, ప్రతిపక్ష నేతలంతా ఏకమై, ముందుకు సాగాలన్నదే తన కల అని అన్నారు. అది దేశానికి మేలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎందుకు హాజరుకాలేదన్న ప్రశ్నపై స్పందిస్తూ.. కేసీఆర్ ర్యాలీ గురించి తనకు తెలియదని, ఒకవేళ ఆహ్వానం వచ్చినా బిజీగా ఉండటం వల్ల వెళ్లడం సాధ్యపడేది కాదని నితీశ్ చెప్పారు.

ఢిల్లీ వీధుల్లో ఖలిస్తాన్ నినాదాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ నగర వీధుల్లోని గోడలపై ఖలిస్తాన్ జిందాబాద్, రిఫరెండం-2020 వంటి నినాదాలు వెలిశాయి. వీటితోపాటు ఖలిస్తాన్ ఉద్యమానికి సంబంధించిన అనేక నినాదాలు రాశారు. వీటిని గమనించిన ఢిల్లీ పోలీసులు వెంటనే వాటిని తొలగించారు. నగరంలోని పశ్చిమ విహార్ ప్రాంతంలో ఖలిస్తాన్ ఉద్యమానికి సంబంధించిన నినాదాలను గురువారం తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో దేశ వ్యతిరేక, ఖలిస్తాన్‌కు సంబంధించిన నినాదాలు రాసినట్లు ఢిల్లీ పోలీసు పీఆర్ఓ సుమన్ నల్వా చెప్పారు. ఇది భద్రతకు సంబంధించిన అంశం కాదని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రిపబ్లిక్ దినోత్సవానికి ముందు తప్పుడు కార్యకలాపాలు ఏమీ జరిగే అవకాశం లేదని ఢిల్లీ పోలీసులు చెప్పినట్లు ఆమె తెలిపారు. 'ఇది దేశ భద్రతపై ఎలాంటి ప్రభావం చూపబోదు. ఎస్ఎఫ్‌జే(సిక్స్ ఫర్ జస్టిస్)ను నిషేధించినప్పటి నుంచి తనకు తాను వార్తల్లో ఉండాలని కోరుకుంటుంది' అని వివరించారు. అమెరికా, కెనడా, బ్రిటన్ వంటి ఇతర దేశాల నుంచి విదేశీయులు ఎస్ఎఫ్‌జేను నడిపిస్తున్నారని,ఈ సంస్థను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు.

నేడు 'రోజ్‌గార్ మేళా' నియామక పత్రాల పంపిణీ

న్యూఢిల్లీ: వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్త ఉద్యోగ నియామకాలకు సంబంధించి 71వేల నియామక పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పంపిణీ చేయనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ప్రధాని నియామక లేఖలను అందిస్తారని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) వెల్లడించింది. గత ఏడాది 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన 'రోజ్‌గార్ మేళా' పథకంలో భాగమే ఇదని పేర్కొంది. ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న మోదీ నిబద్ధత నెరవేర్పు దిశగా ఇదొక ముందడుగు అని పీఎంవో పేర్కొంది.ఉపాధి కల్పనకు 'రోజ్‌గార్ మేళా' ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని, యువత సాధికారత, దేశాభివృద్ధిలో వారి భాగస్వామ్యం కోసం అర్థవంతమైన అవకాశాలను అందించగలదని తెలిపింది. దేశవ్యాప్తంగా ఎంపికైన యువకులు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జూనియర్ ఇంజనీర్లు, లోకో పైలట్లు, టెక్నీషియన్లు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్, స్టెనోగ్రాఫర్, జూనియర్ అకౌంటెంట్, గ్రామీణ డాక్ సేవక్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఉపాధ్యాయులు, నర్సులు, వైద్యులు, సామాజిక భద్రతా అధికారులు వంటి వివిధ ఉద్యోగాల్లో చేరనున్నారు.

ఢిల్లీలో కేరళ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కేవీ థామస్

తిరువనంతపురం: కాంగ్రెస్ బహిష్కృత నేత, కేంద్ర మాజీమంత్రి కేవీ థామస్‌ను న్యూఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా కేబినెట్ హోదాతో నియమించాలని కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై థామస్ స్పందిస్తూ... 'నేను పదవులను ఆశించే వ్యక్తిని కాదు... నా జీవితంలో రాజకీయాలకు అతీతంగా ఎన్నో పనులు చేశాను. కేరళ ముఖ్యమంత్రి ఇప్పుడు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించారు' అని థామస్ విలేకరులతో అన్నారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని చెప్పారు. 2022 మేలో కొచ్చిలో ఎల్‌డీఎఫ్ నిర్వహించిన ఉప ఎన్నిక సభలో విజయన్‌తో కలిసి పాల్గొన్న వెంటనే థామస్‌పై కాంగ్రెస్ తీవ్ర చర్య తీసుకుంది. పార్టీ రాష్ట్ర నాయకత్వంతో విభేదించిన థామస్... త్రిక్కకర అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార ఎల్‌డీఎఫ్ అభ్యర్థి జో జోసెఫ్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేశారు. అయితే ఈ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలిచారు. మునుపటి విజయన్ ప్రభుత్వ హయాంలో సీపీఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ సంపత్ న్యూఢిల్లీలో కేరళ ప్రభుత్వానికి ప్రత్యేక ప్రతినిధిగా ఉన్నారు.గత ఏడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం దేశ రాజధానిలో ప్రత్యేక అధికారిగా మాజీ దౌత్యవేత్త వేణు రాజమోనీని నియమించింది.

మైనర్లు కోర్టుకు రానక్కర్లేదు

- వారిని వర్చువల్‌గా విచారించవచ్చు
- పోక్సో బాధితుల కోసం ఢిల్లీ హైకోర్టు కొత్త మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: పోక్సో కేసుల విచారణప్పుడు బాధిత మైనర్లు కోర్టుకు వర్చువల్‌గా హాజరు కావచ్చు, ప్రత్యక్షంగా రావాల్సిన అవసరంలేదని ఢిల్లీహైకోర్టు పేర్కొంది. నిందితులకు బెయిల్ ఇవ్వాలా వద్దా అని నేరుగా ప్రశ్నించకుండా బాధితుల మానసిక పరిస్థితి, భయాందోళనను పరిగణనలోకి తీసుకొని సున్నితంగా ప్రశ్నించాలని సూచించింది. నిందితుల బెయిల్‌పై విచారణకు వచ్చినప్పుడు బాధితుల వెంట సపోర్ట్ పర్సన్ ఉండాలని, వారికి మానోధైర్యాన్ని ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. నిందితుడికి బెయిల్ మంజూరైతే సంబంధిత పత్రాలను బాధితులకు చేరవేయాలని, తద్వారా దాని రద్దును కోరుతూ ఆమె కోర్టుకు అప్పీలు చేసుకునే వీలు ఉంటుందని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. బాధితులకు వారి రక్షణ ప్రాధాన్యం కాబట్టి నిందితుడి గురించి సమాచారం వారికి ఇవ్వడం సబబుగా ఉంటుందని పేర్కొంది. బెయిల్ షరతులను తెలియజేయాలన్నది. కోర్టు కార్యకలాపాలప్పుడు నిందితుడితో అత్యవసరమైతే తప్ప బాధితులు మాట్లాడాల్సిన పరిస్థితిని నివారించాలని న్యాయాధికారులకు సూచించింది. అత్యాచారాలకు గురైన మైనర్లతో సున్నితంగా వ్యవహరించాలని వెల్లడించింది. లైంగిక వేధింపులు, అత్యాచారాలకు గురైన మైనర్లు కోర్టుకు రావడం వల్ల తమపై జరిగినది మరోమారు జీవిస్తారని, ఇది వారిని మానసికంగా క్షోభ పెడుతుందని న్యాయస్థానం పేర్కొంది. మానసిక కుంగుబాటుకు గురికాకుండా నివారించేందుకు కొన్ని మార్గదర్శకాలను పోక్సో బాధితుల కోసం జారీచేసింది. 'మైనర్ బాలికలు లైంగిక వేధింపులు, అత్యాచారాల కేసుల విచారణకు హాజరైతే తమపై దాడికి పాల్పడిన వ్యక్తి కళ్లెదుటే కనిపిస్తుంటే మనోవేదనకు గురవుతారు. విచారణకు హాజరుకావాల్సిందేనని బాధితులను బలవంతం చేయడం వల్ల వారు తమపై జరిగినది మరోమారు జీవించాల్సి వస్తుంది. దీంతో కుంగుబాటుకు గురవుతారు. ఇటువంటివి నివారించాలి' అని ఈనెల 11న ఇచ్చిన ఆదేశాల్లో జస్టిస్ జస్మీత్‌సింగ్ తెలిపారు. మైనర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పిటిషన్‌ను న్యాయస్థానం విచారించింది. బెయిల్ పిటిషన్లపై విచారణ సమయంలో కోర్టులో భౌతికంగా లేక వర్చువల్‌గా హాజరు కావాలని పోక్సో బాధితులకు సూచిస్తుండటాన్ని సంబంధిత న్యాయాధికారులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 'మీరు చెప్పినదాంతో ఏకీభవిస్తున్నా. చెప్పింది చెప్పినట్లు చేస్తే బాధితులకు మనోవేదన తగ్గించగలుగుతాం' అని న్యాయమూర్తి అన్నారు. పోక్సో కేసుల బాధితులు కోర్టులో వర్చువల్‌గా హాజరుపర్చవచ్చుగానీ ఇది దర్యాప్తు అధికారి (ఐఓ) లేక జిల్లా న్యాయసేవల యంత్రాంగం సహకారంతో జరగాలని మార్గదర్శకాల్లో కోర్టు పేర్కొంది.

చిన్నారిపై అడవి తోడేలు దాడి

సుల్తాన్‌పూర్ (ఉత్తరప్రదేశ్): పద్దెనిమిది నెలల చిన్నారిపై ఓ గ్రామంలో అడవి తోడేలు దాడి చేసి గాయపరచినట్టు పోలీసులు గురువారం తెలిపారు. ఈ ఘటన బల్దీరాయ్ పోలీసుస్టేషన్ ప్రాంతంలోని చక్‌ముసి గ్రామంలో బుధవారం రాత్రి జరిగినట్టు పేర్కొన్నారు. ఓ ప్రాథమిక పాఠశాలలో ఆవరణలో టెంట్ కింద, కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తున్న ప్రీతీని తోడేలు లాక్కెళ్లినట్టు బల్దీరాయ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అర్ధరాత్రి మెలకువ వచ్చి చూసిన చిన్నారి తండ్రికి తన కుమార్తె కనబడలేదని ఆయన పేర్కొన్నారు. వెంటనే వారంతా కలిసి చుట్టుపక్కల గ్రామాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఒకచోట బాలికపై కూర్చున్నట్టు గమనించారు. గ్రామస్తులంతా ఒక్కసారిగా అక్కడకు వెళ్లడంతో తోడేలు అక్కడి నుంచి పరారైంది. గాయపడ్డ బాలికను తీసుకుని వారంతా తమ గ్రామానికి చేరుకున్నారు. దీనిపై మరింత విచారణ చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

ఎల్జీ నివాసం ఎదుట వ్యాపారుల ఆందోళన

న్యూఢిల్లీ: దుకాణాలకు సీలు వేయడాన్ని నిరసిస్తూ ఢిల్లీలోని సదర్ బజార్ వ్యాపారులు గురువారం లెఫ్టినెంట్ గవర్నర్ హౌస్ వెలుపల ధర్నా నిర్వహించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన వ్యాపారుల సంస్థ ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు ఈ విషయంపై లేఖ కూడా రాసింది. ఈ నెల ప్రారంభంలో పాత ఢిల్లీలోని సదర్ బజార్‌లో 25 దుకాణాలకు సీలు వేయగా, మరో ఐదుగురికి తమ స్థలాలను ఖాళీ చేయాలని నోటీసులు అందాయి.

సదర్ బజార్‌లో దుకాణాల తొలగింపుతో ఇతర మార్కెట్‌ల దుకాణదారులు కూడా భయాందోళనలకు గురయ్యారని సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్, కార్యదర్శి సుభాష్ ఖండేల్వాల్ తెలిపారు. 'వ్యాపారులకు సీలింగ్ బెదిరింపులు వస్తున్నాయి.

ప్రస్తుతం ఢిల్లీలోని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ)లో ప్రభుత్వం లేదు ఎంసీడీ నియంత్రణ ఎల్జీ వద్ద ఉంది, అధికారులందరూ ఎల్జీకి మాత్రమే నివేదిస్తున్నారు' అని గోయల్ చెప్పారు. ఎంసీడీలో కొత్త పాలన ఏర్పడే వరకు ఎలాంటి సీలింగ్ చర్యలు తీసుకోవద్దని ఎల్‌జీకి రాసిన లేఖలో గోయల్ పేర్కొన్నారు. సీలింగ్ అంశాన్ని ఎంసీడీ కౌన్సిల్‌లో చర్చించాలని కోరుతున్నామన్నారు.

భయోత్పాతం, విద్వేషమే లక్ష్యం

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై రాహుల్‌గాంధీ విమర్శ

పఠాన్‌కోట్: మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ గురువారం విరుచుకుపడ్డారు. దేశంలో భయోత్పాతం, విద్వేష వాతావరణం సృష్టిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. పంజాబ్‌లో భారత్ జోడో యాత్ర చివరిరోజు ఇక్కడ జరిగిన భారీ ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. మతానికీ మతానికి, కులానికీ కులానికి, భాషకూ భాషకు మధ్య బీజేపీ గొడవలు పెడుతోందని రాహుల్ మండిపడ్డారు. దేశ ప్రజలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ భయకంపితులను చేస్తోందని, వాటి ప్రణాళికలన్నీ వాటిపైనే ఉన్నాయని చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ), రుణాల మాఫీ, పట్టణ పునరుద్ధరణ యంత్రాంగం, హరిత విప్లవం, శ్వేత విప్లవం వంటి పథకాలను యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలన్నీ ప్రజల్లో భయాన్ని తొలగించాయన్నారు. బీజేపీ విధానాలన్నీ భయాన్ని వ్యాప్తి చేసేవేనన్నారు. 'రైతులు వేకువజాము నాలుగు గంటలకే లేస్తారు. రోజంతా కష్టపడతారు. దేశానికి ఆహారం అందిస్తారు. దీనికి ప్రతిగా రైతులు ఏమీ కోరుకోరు. కేవలం గౌరవాన్ని ఆశిస్తారు' అని రాహుల్ చెప్పారు. అలాంటి రైతులను మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం మూడు సాగు చట్టాలు తీసుకొచ్చి రైతుల్లో భయాన్ని సృష్టించిందని, తీవ్ర వ్యతిరేకతల మధ్య చివరికి ఆ చట్టాలు రద్దు చేసిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను ప్రస్తావిస్తూ పంటనష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రకృతి విపత్తుల కారణంగా నష్టం జరిగిన పంటకు పరిహారంగా బీమా ఇచ్చినట్లు ఒక్క రైతు తనకు చెప్పలేదని రాహుల్ వివరించారు. మోదీ సర్కారు తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకంపైనా ఆయన నిప్పులు చెరిగారు. రక్షణరంగంలో చేరాలనుకునే యువత కల దీనివల్ల చెదిరిపోయిందన్నారు. సాయుధ బలగాల్లో చేరాలని లక్షలాదిమంది యువత కోరుకుంటున్నారన్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీపైనా ఆరోపణలు చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తయారీ కేంద్రంగా లూధియానాను ఉపయోగించుకోవచ్చని, దీని ద్వారా చైనాతో భారత్ పోటీపడవచ్చని చెప్పారు. కాంగ్రెస్ పంజాబ్ రాష్ట్ర అధ్యక్షుడు అమరేందర్‌సింగ్ రాజా, ప్రతిపక్ష నేత ప్రతాప్‌సింగ్ బాజ్వా, ఎంపీలు అమర్‌సింగ్, మొహమ్మద్ సిద్ధిఖీ, మాజీ సీఎం చరణ్‌జిత్‌సింగ్ చన్నీ, సీనియర్ నేతలు జైరాం రమేశ్, హరీశ్ చౌదరి, ఇతర నేతలు పాల్గొన్నారు.

నిందితుల్ని దీర్ఘకాలం జైల్లో ఉంచరాదు

ఆశీష్ మిశ్రా బెయిల్‌పై సుప్రీం తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: నేరం రుజువై దోషిగా నిర్ధారించనంత కాలం నిందితుడిగా ఉన్నవారిని దీర్ఘకాలం జైల్లో ఉంచరాదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లఖింపూర్ ఖేరి హింసపై కేసులో ప్రధాన నిందితుడైన కేంద్రమంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశీష్‌మిశ్రా బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం పరిశీలించింది. ఈ కేసులో జైళ్లలో మగ్గుతున్న రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నదని, ఆశీష్ మిశ్రాకు బెయిల్ ఇవ్వకపోతే వాళ్లు (రైతులు) జైల్లో ఉండవల్సిందేనని పేర్కొంది. బెయిల్‌పై తీర్పును రిజర్వులో పెట్టిందని జస్టిస్ సూర్యకాంత, జస్టిస్ జేకే మహేశ్వరి ధర్మాసనం వెల్లడించింది. వాదుల హక్కుల సమతుల్యత దృష్ట్యా ఆదేశాలిస్తామని తెలిపింది. 'దోషిగా నిర్ధారణ కానంత వరకు నిందితులుగా ఉన్న వారిని నిర్దేశిత కాలం వరకే జైల్లో ఉంచాలి. వారిని నిరవధికంగా జైల్లో ఉంచరాదు. ఇదొక్క పిటిషన్‌నే కాదు. ఎదుట ఉన్న బాధితుడితో పాటు కోర్టు రాలేని బాధితులనూ... వారి దీనపరిస్థితినీ పరిగణనలోకి తీసుకుంటా. 19ఏళ్లుగా నా పంథా ఇదే. మేము నోరు విప్పాలని మీరు కోరుకుంటున్నారు. జైళ్లలో ఉన్న ఆ రైతులే అత్యంత బాధితులు. వారి గురించి ఆలోచించేది ఎవరు? ఇప్పుడు ఈ వ్యక్తికి ఏదో ఒకటి ఇవ్వకపోతే వాళ్లకూ ఏమీ దక్కదు. భవిష్యత్‌లోనూ వారు జైళ్లకే పరిమితమవుతారు. ఇప్పటికే కిందిస్థాయి కోర్టు వారికి బెయిల్ నిరాకరించింది' అని జస్టిస్ కాంత్ అన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాది దుశ్యంత్ దవే స్పందిస్తూ న్యాయస్థానం పోలిక తనను ఆశ్చర్యానికి గురిచేయడమే కాకుండా నిరాశపర్చిందన్నారు. ఈ కేసులో నిశిత పర్యవేక్షణ అవశ్యమని, అందుకు కట్టుబడతామని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. సాక్షుల విచారణ పూర్తి అయ్యేంత వరకు దీనిని పెండింగ్‌లో పెడతామని చెప్పింది. రోజువారీ విచారణ చేపట్టాలని విచారణ కోర్టును ఒత్తిడి చేయలేమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ గరీమా ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు ముకుల్ రొహత్గీ, దుశ్యంత్ దవే వాదనలు విన్న అనంతరం 'తగు ఆదేశాలిస్తాం' అని ధర్మాసనం స్పందించింది. ఆశీశ్ మిశ్రాకు బెయిల్‌ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వ్యతిరేకించింది. ఎనిమిది మంది మరణానికి కారణమైన వ్యక్తికి బెయిలిస్తే సమాజంలోకి తప్పుడు సంకేతం వెళుతుందని సుప్రీంకోర్టుకు తెలిపింది. దవే వాదనలను మిశ్రా తరపు న్యాయవాది ముకుల్ రొహత్గీ వ్యతిరేకించారు. ఏడాదికిపైగా కస్టడీలోనే మిశ్రా ఉన్నారని, విచారణ జరుగుతున్న తీరును బట్టి ఇది మరో ఏడెనిమిదేళ్లకు పూర్తి అయ్యేలా ఉన్నదన్నారు. కేసులో ఫిర్యాది జగదీప్ సింగ్ ప్రత్యక్ష సాక్షి కాదని, ఆనోట ఈ నోట విన్నదే ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారని, తన క్లయింట్ నేరచరితుడు కాదని రొహత్గీ వాదించారు. ఈ కేసులో ఆశీశ్‌మిశ్రాతో పాటు 13 మందిపై ఐపీసీలోని 147, 148, 149, 302, 307, 326, 427, 120బీ సెక్షన్లతో పాటు మోటార్‌వాహన చట్టంలోని సెక్షన్ 177 కింద కేసు ఉన్న విషయం విదితమే.

కర్ణాటకలో బీజేపీ నేతల కమీషన్ల దందా

- కాంట్రాక్టర్ల ఆందోళన
- బెంగళూరులో భారీ నిరసన
- ముడుపుల బాగోతంపై విచారణకు డిమాండ్

బెంగళూరు: కర్ణాటకలో బీజేపీ పాలనలో అవినీతి పెచ్చరిల్లడంపై కాంట్రాక్టర్లు నిరసనకు దిగారు. ఇక్కడి స్వాతంత్ర్య ఉద్యానవనంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కాంట్రాక్టర్లు తరలివచ్చారు. బొమ్మై సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు కెంపణ్ణ మాట్లాడుతూ బీజేపీ పాలనలో గతంలో కంటే అవినీతి భారీ పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతికి వ్యతిరేకంగా తాము ఏడాదిన్నరగా పోరాటం సాగిస్తున్నామని చెప్పారు. '40 శాతం కమీషన్'పై తాము ఆరోపణలు చేసినప్పుడల్లా, ఆధారాలు లేవంటూ ప్రభుత్వం కొట్టివేస్తున్నదన్నారు. అయితే తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, శాంపిల్‌గా రెండు రోజుల కిందటే ఆడియో టేపులను విడుదల చేసినట్టు వెల్లడించారు. ఆ ఆడియో టేపుల్లో ముడుపులకు సంబంధించి బీజేపీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, కాంట్రాక్టర్ మంజునాథ్ మధ్య జరిగిన సంభాషణ ఉన్నది. గత మూడేళ్లలో తిప్పారెడ్డికి తాను రూ.90 లక్షలు లంచం చెల్లించినట్టు మంజునాథ్ ఆరోపించారు. 40 శాతం వరకూ కమీషన్ చెల్లిస్తున్నందునే పనులు నాసిరకంగా ఉంటున్నాయని, ఆ పనుల్లో ఏవైనా అనర్థాలు జరిగినప్పుడు కాంట్రాక్టర్లను బలిపశువులను చేస్తున్నారని కెంపణ్ణ ఆవేదన వ్యక్తంచేశారు. కమీషన్ల వ్యవహారంపై ఉన్నత న్యాయస్థానం జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల కాంట్రాక్టు బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అభివృద్ధే మా ప్రాధాన్యం

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రెట్టింపు లబ్ధి: మోదీ

యాద్గిరి (కర్ణాటక): దేశ అభివృద్ధే బీజేపీ ప్రభుత్వ ప్రాధాన్యత అని, ఓటు బ్యాంకు రాజకీయాలు తమకు అవసరం లేదని ప్రధాని నరేంద్రమోదీ చెప్పుకొచ్చారు. 21వ శతాబ్దంలో భారత్ అభివృద్ధికి నీటి భద్రత ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలో నీటి పారుదల, తాగునీరుకు సంబంధించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జాతీయ రహదారి అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. వచ్చే 25ఏళ్లు ప్రతిపౌరుడికి, దేశానికి అమృత కాలమన్నారు. ఈ సమయంలోనే అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కర్ణాటకను పాలించిన ఇతర పార్టీలు లక్ష్యంగా ఎదురుదాడికి దిగారు. ఆ పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాలే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల వెనుకబాటుకు కారణమని నిందించారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ బీజేపీ ప్రభుత్వం ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వమంటే...రెండు వైపులా లబ్ధి, సంక్షేమం, అభివృద్ధి కూడా రెండింతలు వేగంగా ముందుకు సాగుతుందని మోదీ చెప్పారు.

ఇందుకు కర్ణాటక మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ ఏడాది మేలో కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. పొలాల్లో మంచి పంటలు, పరిశ్రమలు విస్తరించుకున్నప్పుడే భారత్ అభివృద్ధి చెందుతుందని మోదీ చెప్పారు. బీజేపీ ప్రభుత్వ ప్రాధాన్యం ఓటు బ్యాంకు కాదని, అభివృద్ధే ప్రాధాన్యమని చెప్పుకున్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రెట్టింపు సంక్షేమం ఉంటుందని, దీనివల్ల కర్ణాటక ఎలా ప్రయోజనం పొందుతుందో చూడాలని కోరారు. కర్ణాటకలో గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. యాద్గిరితోపాటు ఉత్తర కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలను వెనకబడిన ప్రదేశాలుగా ప్రకటించడానికే ఆ పార్టీ తన బాధ్యతను పరిమితం చేసిందని మోదీ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చేటప్పటికి దేశంలో కేవలం 3కోట్ల ఇళ్లకు మాత్రమే కుళాయి ద్వారా నీళ్లు వచ్చేవని, ప్రస్తుతం 11 కోట్ల ఇళ్లకు అందుతున్నాయని చెప్పారు. కర్ణాటక అసెంబ్లీకి ఈ ఏడాది మే లోపే ఎన్నికలు జరగనున్నాయి.

మొత్తం 224 స్థానాలుండగా కనీసం 150 చోట్ల విజయం సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ ఈ నెలలోనే రాష్ట్రంలో రెండోసారి పర్యటించారు. జనవరి 12న హుబ్బళ్లిలో జాతీయ యువజన ఉత్సవాన్ని ప్రారంభించిన మోదీ.. భారీ రోడ్‌షో నిర్వహించారు. తాజాగా రూ.10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

ఉన్నత విద్యాశాఖలో ఖాళీల భర్తీ

- పాఠ్యప్రణాళికలో కొత్త కోర్సులు
- జూన్‌కల్లా ప్రక్రియ పూర్తి
- ప్రతి విద్యాసంస్థకు నాక్ అక్రిడిటేషన్
- సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఉన్నత విద్యాశాఖలో జూన్‌కల్లా ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. అలాగే విదేశాల్లో విద్యార్థులకు అందిస్తున్న వివిధ కోర్సులను పరిశీలించి వాటిని కూడా ఇక్కడ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గురువారం ఉన్నత విద్యాశాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. డిగ్రీ చదువుతున్న వారి నైపుణ్యాలను బాగా పెంచాలని, వివిధ కోర్సులను పాఠ్యప్రణాళికలో ఇంటిగ్రేట్ చేయాలన్నారు. జాబ్ ఓరియెంటెడ్ కరిక్యులమ్ ఉండాలని, సర్టిఫైడ్ ఆన్‌లైన్ వర్టికల్స్ కరిక్యులమ్‌లో భాగం కావాలన్నారు. ఈ తరహా కోర్సుల వల్ల డిగ్రీ పూర్తయ్యేనాటికి స్వయం ఉపాధి అందుతుందన్నారు. ప్రఖ్యాత కాలేజీల కరిక్యులమ్ చూసి, వాటిని మన దగ్గర అమలయ్యేలా చూడాలన్నారు. స్వయం ఉపాధిని కల్పించే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలతో ఈ కోర్సుల కోసం టైఅప్ చేసుకోవాలన్నారు. రిస్క్ ఎనాలసిస్, బ్యాంకింగ్, రిస్క్ మేనేజిమెంట్, రియల్ ఎస్టేట్ వంటి కోర్సులపై దృష్టి పెట్టాలని, వచ్చే జూన్ కల్లా పాఠ్యప్రణాళికలో ఈ కోర్సులు భాగం కావాలని ఆదేశించారు. ఉన్నత విద్యాశాఖలో పెద్ద ఎత్తున సంస్కరణలు చేపడుతున్నామని, ఈ నేపథ్యంలో సిబ్బంది భర్తీ కూడా త్వరితగతిన చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యాశాఖ పరిధిలోని ప్రతి కాలేజీలో బోధన, వసతుల పరంగా నాణ్యత పెరగాలని, ప్రతి విద్యాసంస్థ నాక్ అక్రిడిటేషన్ సాధించాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం మూడేళ్లలో కాలేజీల ప్రమాణాలు పెంచుకునేలా వారికి అధికారులు చేయూత నివ్వాలన్నారు. ఒక్కో ఏడాది ఒక్కో లక్ష్యాన్ని అందుకుంటూ మూడేళ్లలో ప్రమాణాలు పెంచుకోవాలని, మూడేళ్ల తర్వాత కచ్చితంగా ఉన్నత విద్యాశాఖలోని విద్యాసంస్థలు నాక్ అక్రిడిటేషన్ సాధించాలని, అలా సాధించలేని పక్షంలో సంబంధిత కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఆదేశించారు. కళాశాలల్లో కోర్సులన్నీ ఇవాల్టి అవసరాలకు తగిన విధంగా రూపొందించాలన్నారు. కళాశాలలకు అనుమతుల విషయంలో కూడా ఒకటే విధానం ఉండాలని, వివిధ కోర్సులకు సంబంధించిన కరిక్యులమ్ అందించే బాధ్యత స్కిల్ యూనివర్సిటీ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం వారికి మార్గనిర్దేశనం చేశారు. కోడింగ్, క్లౌడ్ సర్వీసెస్‌లాంటి డిమాండ్ ఉన్న కోర్సులపై దృష్టి పెట్టాలని, విద్యార్థులకు సర్టిఫికేషన్ ఉంటేనే ఎంప్లాయిమెంట్ పెరుగుతుందన్నారు. ఇక మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి ఇతర చదువులు చదువుతున్న వారికి పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తోందని, సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దేశంలో అందిస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని సీఎం అన్నారు. ట్రిపుల్ ఐటీలలో సిబ్బంది నియామకం, ఇతర పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశానికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కే ఎస్ జవహర్ రెడ్డి, విద్యాశాఖ సలహాదారు ఏ సాంబశివారెడ్డి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు, ఆర్‌జీయూకేటీ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి, కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

'రామసేతు'పై ప్రభుత్వానిదే నిర్ణయం

న్యూదిల్లీ:
జాతీయ వారసత్వ కట్టడంగా రామసేతును ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ వ్యవహారంలో రాజ్యసభ మాజీ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం విచారించింది. మీరు కావాలంటే ఈ వ్యవహారంలో ప్రభుత్వంలో మాట్లాడవచ్చని స్వామికి ధర్మాసనం సూచించింది. ఈ కట్టడాన్ని వారసత్వ సంపదగా ప్రకటించేందుకు సాంస్కృతిక శాఖ కసరత్తు చేస్తోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారని ఆయనకు తెలిపింది. ఈ వ్యవహారంలో నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. అసంతృప్తిగా ఉన్నట్లయితే మరోమారు తమను సంప్రదించవచ్చునని చెప్పి ప్రస్తుతం ఇదే అంశమై దాఖలైన అర్జీని కొట్టివేసింది. దీనిపై స్వామి స్పందిస్తూ 'నేనే ఎవరినీ కలవాలని అనుకోవడం లేదు. మా అందరిది ఒకటే పార్టీ. మేనిఫెస్టోలో ఈ అంశం ఉన్నది. దీనిపై ఆరు వారాల్లో వారినే తేల్చనివ్వండి లేకపోతే నేను మళ్లీ వస్తాను' అని అన్నారు. 2019లో అప్పటి సాంస్కృతిక శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ ఇదే అంశంపై ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి రామసేతును జాతీయ వారసత్వ కట్టడంగా ప్రకటించాలని సిఫార్సు చేశారు. ఇందుకు అవుననో కాదనో వారు సమాధానం ఇవ్వాలని బీజేపీ ప్రభుత్వానికి స్వామి స్పష్టంచేశారు.

దిల్లీ హైకోర్టు జడ్జీగా సౌరభ్ కిర్పాల్

మరోమారు కొలీజియం సిఫార్సు

న్యూదిల్లీ:
దిల్లీ ఉన్నత న్యాయస్థానానికి న్యాయమూర్తిగా సీనియర్ న్యాయవాది సౌరభ్ కిర్పాల్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం మరోమారు సిఫార్సు చేసింది. 2021, నవంబరు 11న కూడా ఈయన పేరునే హైకోర్టు జడ్జీగా కొలీజియం సిఫార్సు చేసింది. తాను గే అని కిర్పాల్ బహిరంగంగా ప్రకటించిన క్రమంలో ఆయన పదోన్నతికి కేంద్రం అభ్యంతరం తెలిపింది. ఐదేళ్లుగా కిర్పాల్ నియామకం పెండింగ్‌లో ఉన్నదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కొలీజియం పేర్కొంది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానం వెబ్‌సైట్ ప్రకటన పేర్కొంది. సౌరభ్ కిర్పాల్ మాజీ సీజేఐ బీఎన్ కిర్పాల్ తనయుడు. దిల్లీ హైకోర్టు కొలీజియం 2017, అక్టోబరు 13న కిర్పాల్ పేరును ఏకగ్రీవంగా ఆమోదించింది. 2021, నవంబరు 11న సుప్రీంకోర్టు కొలీజియం అంగీకారం తెలిపింది. 2022, నవంబరు 25న ఇదే సిఫార్సు చేసిందని ప్రకటన తెలిపింది. తాను గే అని బహిరంగంగా చెప్పడం కిర్పాల్ వ్యక్తిత్వాన్ని సూచిస్తుందని కొలీజియం ప్రశంసించింది. జీవితభాగస్వామి విదేశీయురాలన్న కారణంగా కిర్పాల్ అభ్యర్థిత్వాన్ని బేఖాతరు చేయడం తగదని కొలీజియం ఇంతకుముందే తెలిపింది. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న చాలా మంది జీవితభాగస్వాములు విదేశీయులు ఉన్నట్లు పేర్కొంది. కిర్పాల్‌కు పదోన్నతిని నిరాకరించడానికి తమకు ఎలాంటి కారణాలు కనిపించలేదని కొలీజియం వెల్లడించింది.

108 మంది మహిళా సైన్యాధికారులకు 'కమాండ్'

తొలిసారి కల్నల్‌గా పదోన్నతులు

న్యూదిల్లీ:
సైన్యంలో మహిళా అధికారులకు ప్రాధాన్యత పెరుగుతోంది. క్రమంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు సాయుధ దళాల్లోనూ సత్తా చాటుతున్నారు. ఎన్నడూ లేని విధంగా తొలిసారి మగ సైన్యాధికారులతో దీటుగా 'కమాండ్' బాధ్యతలను చేపట్టబోతున్నారు. మొత్తం 108 మంది మహిళా సైన్యాధికారులను కల్నల్‌గా పదోన్నతులు వరించాయి. వారు దళాలకు సారథ్యం వహిస్తారు. సాయుధ దళాల్లో కల్నల్, ఆపై స్థాయి పదవులన్నీ ఎంపిక చేసే పదవులు.. అధికారులు అందరూ ఈ పదవులను దక్కించుకోలేరు. కమాండ్ అసైన్మెంట్లకు సమర్థులైన 108 మహిళా అధికారులను సెలక్షన్ బోర్డు ఎంపిక చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జనవరి చివరికి తొలివిడదల పోస్టింగులు పూర్తవుతాయి. ఈనెల 9వ తేదీ నుంచి ఆర్మీ కేంద్ర కార్యాలయాల్లో కల్నల్‌గా సమర్థులైన లెఫ్టినెంట్ కల్నల్‌ల ఎంపిక జరుగుతోంది. 108 ఖాళీలు ఉండగా మొత్తం 244 మంది మహిళా అధికారులను పదోన్నతుల కోసం పరిగణనలోకి తీసుకున్నారు. ఇంజినీర్లు, సిగ్నల్స్, ఆర్మీ ఎయిర్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్ కార్ప్స్, ఆర్మీ సర్వీస్ కార్ప్స్, ఆర్మీ ఆర్డనెన్స్ కార్ప్స్, ఎలక్ట్రికల్ & మెకానికల్ ఇంజినీర్స్ (ఈఎంఈ) శాఖల్లో మహిళా అధికారులు ఉంటారు. లింగ సమానత్వం దృష్ట్యా 108 మంది మహిళా అధికారుల పదోన్నతులకు కేంద్రప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. సెలక్షన్ బోర్డులో పరిశీలకులుగా 60 మంది మహిళా అధికారులను ఆర్మీ ఆహ్వానించింది. ఎంపిక నిష్పాక్షికంగా జరిగేలా చూసింది. పురుషులతో సమానంగా మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ (పీసీ)ని సైన్యం ఆమోదించింది. దీంతో వారు ఉన్నత ర్యాంకులు పొందేందుకు వీలు ఉంటుంది. శాశ్వత కమిషన్ పరిధిలోని మహిళా అధికారులంతా ప్రస్తుతం ప్రత్యేక శిక్షణలో ఉన్నారు. ఉన్నత నాయకత్వ స్థానాలకు సమర్థులుగా తయారవుతున్నారు. మిలటరీ అసైన్మెంట్లు చేపడుతున్నారు. ప్రతిష్ఠాత్మక డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కోర్స్ (డీఎస్‌ఎస్‌సీ), డిఫెన్స్ సర్వీసెస్ టెక్నికల్ స్టాఫ్ కోర్స్ (డీఎస్‌టీఎస్‌సీ) పరీక్షల్లో ఐదుగురు మహిళా అధికారులు ఉత్తీర్ణత సాధించారు. ఏటా సెప్టెంబరులో జరిగే ఈ పరీక్షల్లో తొలిసారి మహిళా అధికారులు ఉత్తీర్ణత సాధించారు. వీరు ఏడాది శిక్షణ పొంది కమాండ్ నియామకాలకు అర్హత సాధిస్తారు. ఏవియేషన్ విభాగాల్లో మహిళా కాంబాట్ ఏవియేటర్లు పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్ప్స్ ఆఫ్ ఆర్టిలరీలోనూ త్వరలోనే అడుగు పెట్టబోతున్నారు. ఓ మహిళాధికారి ఈమధ్యనే సియాచిన్‌లో నియమితులయ్యారు.

రెండో సంపన్న పార్టీ టీఎంసీ

- ఏడాదిలో 633 శాతం పెరిగిన ఆదాయం
- కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టిన తృణమూల్
- ఈసీఐ ఆడిట్ నివేదికల్లో వెల్లడి

న్యూదిల్లీ:
దేశంలోని జాతీయ పార్టీల్లో రెండో సంపన్న పార్టీగా తృణమూల్ కాంగ్రెస్ నిలిచింది. మొదటిస్థానంలో బీజేపీ ఉన్నది. టీఎంసీ ఆదాయం కేవలం ఏడాదిలో 633శాతం పెరిగింది. దీంతో సంపన్న పార్టీల జాబితాలో రెండవస్థానానికి ఎగబాకింది. ఈ మేరకు భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) వార్షిక ఆడిట్ నివేదికలు పేర్కొన్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో బీజేపీ రూ.1,917.12 కోట్లు ఆర్జించగా అంతకుముందు ఏడాది రూ.752.33 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఈ లెక్కన బీజేపీ ఆదాయం ఏడాదిలో 155శాతం పెరిగిందని టెలిగ్రాఫ్ నివేదించింది. టీఎంసీ సంపద రూ.74.42 కోట్ల నుంచి 2021-22లో రూ.545.75కోట్లకు పెరిగిందని పేర్కొంది. వందేళ్ల కాంగ్రెస్ పార్టీకంటే టీఎంసీ ఆదాయం ఎక్కువగా ఉన్నట్లు ఈసీఐ ఆడిట్‌లో వెల్లడైంది. కాంగ్రెస్ ఆదాయం 2021-22లో రూ.541.27కోట్లు కాగా ఈ పార్టీ ఆదాయం 89.4శాతం పెరిగిందని ఈసీఐ డేటా చెబుతోంది. అంతకుముందు ఏడాది రూ.285.76 కోట్లను కాంగ్రెస్ పార్టీ ఆర్జించింది. మొత్తం ఎనిమిది జాతీయ పార్టీల ఆదాయాలపై ఈసీఐ ఈ ఆడిట్ నివేదికలను వెలువరించింది. అన్ని పార్టీలకు మొత్తంగా రూ.3,289 కోట్ల విరాళాలు లేక నిధులు సమకూరాయి. ఇందులో దాదాపు 58శాతం బీజేపీ ఖాతాలోకి వెళ్లాయి. జాతీయ పార్టీల జాబితాలో రెండు వామపక్ష పార్టీలు ఉండగా సీపీఎం ఆదాయం 2021-22లో రూ.162.24 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది రూ.171.05 కాగా స్వల్ప తగ్గుదల నమోదైంది.

జరిమానా కట్టాల్సిందే

గూగుల్‌కు సుప్రీం కోర్టు ఆదేశం

న్యూదిల్లీ:
అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజం గూగుల్‌కు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పును వ్యతిరేకిస్తూ గూగుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత ధర్మాసనం కొట్టివేసింది. ఆండ్రాయిడ్ ఉత్పత్తులకు సంబంధించి తన ఆధిపత్యాన్ని గూగుల్ దుర్వినియోగం చేస్తోందని, అనైతికంగా, పోటీ చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందంటూ కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గతంలో రూ.1,337 కోట్ల జరిమానా విధించింది. దీనిపై గూగుల్ ఎన్‌సీఎల్ఏటీని ఆశ్రయించింది. అక్కడ వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. జరిమానాలో 10 శాతం మొత్తాన్ని నాలుగు వారాల్లోగా జమ చేయాలని ఆదేశించింది. ఎన్‌సీఎల్ఏటీ తీర్పుపై స్టే విధించాలని కోరుతూ.. గూగుల్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తాజాగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దివాలా త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసును తిరిగి ఎన్‌సీఎల్ఏటీకి అప్పగించింది. మార్చి 31లోగా కేసును పూర్తి చేయాలని తెలిపింది. గతంలో సీసీఐ విధించిన అపరాధ రుసుములో 10శాతం చెల్లించేందుకు గూగుల్‌కు వారం రోజులు గడువిచ్చింది. మరోవైపు కేసు విచారణ కోసం గురువారం నుంచి మూడు రోజుల్లోగా ఎన్‌సీఎల్ఏటీని సంప్రదించాలని గూగుల్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. సీసీఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్ వెంకటరమణన్ గతంలో వాదనలు వినిపించారు. గూగుల్ సంస్థ ఐరోపా దేశాల్లో ఒక విధంగా, భారత్‌లో మరోలా వ్యవహరిస్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. యూరోపియన్ కమిషన్ ఆదేశాలను గూగుల్ పాటిస్తోందని తెలిపారు.

చెలరేగిన త్రిష

ఐసీసీ మహిళల అండర్-19 సూపర్ సిక్స్‌కు భారత్

సెంచూరియన్:
ఐసీసీ మహిళల అండర్ 19 ప్రపంచకప్‌లో టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విజయాలందుకున్న షెఫాలీ వర్మ సారథ్యంలోని భారత జట్టు సూపర్-6కు అర్హత సాధించింది. బుధవారం స్కాట్లాండ్‌తో జరి గిన గ్రూప్-డీ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత అమ్మాయిలు, 85 పరుగుల తేడాతో భారీ విజయాన్నందుకున్నారు. తెలంగాణ అమ్మాయి.. గొంగడి త్రిష(51 బంతుల్లో 6 ఫోర్లతో 57) హాఫ్ సెంచరీతో భారత విజయంలో కీలక పాత్ర పోషిం చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 149 పరుగులు చేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో మెరు పులు మెరిపించిన కెప్టెన్ షెఫాలీ వర్మ విఫలమైనా.. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష సూపర్ ఫిఫ్టీతో భారత్‌ను ఆదుకుంది. ఆమెకు తోడుగా రిచా ఘోష్(33), శ్వేతా షెరావత్(10 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 31 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగింది. అనంతరం స్కాట్లాండ్.. 66 పరుగులకే కుప్పకూలింది. స్కాంట్లాడ్ బ్యాటర్లలో డెర్సీ కార్టర్ (24) టాప్ స్కోరర్. భారత బౌలర్లో మనత్ కశ్యప్ నాలుగు వికెట్లు తీయగా.. అర్చనా దేవి మూడు వికెట్లు పడగొట్టింది. సోనమ్ యాదవ్‌కు రెండు వికెట్లు దక్కాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో చెలరేగిన షఫాలీ వర్మ (1) ఈ మ్యాచ్‌లో దారుణంగా విఫలమైంది. ఈ పరిస్థి తుల్లో రిచా ఘోష్ (35 బంతుల్లో 22, 3 ఫోర్లు)తో కలిసి మూడో వికెట్‌కు తెలంగాణ అమ్మాయి త్రిష 70 పరుగులు జోడిం చింది. అయితే 17వ ఓవర్లో భారత్‌కు డబుల్ స్ట్రోక్ తాకింది. హాఫ్ సెంచరీ పూర్తిచేసుకున్న త్రిషతో పాటు రిచా కూడా కాథరీన్ ఫ్రేసర్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరారు. చివర్లో వచ్చిన శ్వేతా షెహ్రావత్.. 10 బంతుల్లోనే 4 బౌండరీలు, రెండు భారీ సిక్సర్లు బాది 31 పరుగులు చేసింది. దాంతో స్కాట్లాండ్ ముందు పోరాడే లక్ష్యం నమోదైంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు భారత్.. తమ తొలి మ్యాచ్‌లో సౌతాఫ్రికాను రెండో మ్యాచ్‌లో యూఏఈని చిత్తుచిత్తుగా ఓడించింది.

వైజాగ్‌లో అల్లు అర్జున్ సందడి

విశాఖపట్నం:
అల్లు అర్జున్, రష్మిక జంటగా నటిస్తున్న 'పుష్ప-2' చిత్రం షూటింగ్ వైజాగ్‌లో షురూ కానుంది. ఇటీవల హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. తదుపరి షిప్‌యార్డ్‌లో చిత్రీకరించాల్సిన సన్ని వేశాల కోసం బ్యాంకాక్‌లో రెక్కీ నిర్వహించారు. అక్కడ పర్మి షన్ లభించకపోవడంతో ఆ సన్నివేశాలను వైజాగ్‌లో ప్లాన్ చేశారు. పది రోజుల క్రితం సుకుమార్ బృందం విశాఖకు రెక్కీ కోసం వెళ్లారు. అక్కడ లోకేషన్ ఫైనల్ కావడంతో చిత్ర యూనిట్ అక్కడికి చేరుకొంది. హీరో అల్లు అర్జున్ గురువారం వైజాగ్ చేరుకోబోతునట్లు తెలిసింది. అక్కడ పది రోజుల పాటు హీరోపై సాగే కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారనీ, ఫిబ్రవరిలో హీరోయిన్ రష్మిక సెట్‌లో అడుగుపెట్టబోతుందని సన్నిహిత వర్గాల నుంచి సమాచారం. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ రూపొందిన 'పుష్ప-1' పాన్ ఇండియా స్థాయిలో విజయం సాధించడంతో పుష్ప-2పై మరింత దృష్టి సారించారు. అంతకు మించి ఈ చిత్రం అవుట్‌పుట్ వచ్చేలా చిత్ర బృందం కృషి చేస్తోంది.

మెగాస్టార్ మరో రీమేక్?



హైదరాబాద్:
మెగాస్టార్ చిరంజీవి విరామం అనేది లేకుండా వరుసగా ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తున్నారు. ప్రస్తుతం 'భోళా శంకర్'లో నటిస్తున్నారు. అజిత్ నటించిన 'వేదళం'కు రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు. వేసవి కానుకగా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత చిరు నెక్స్ట్ ప్రాజెక్ట్ ఫిక్స్ అయినట్టు ఫిల్మ్ నగర్‌లో రూమర్స్ హల్‌చల్ చేస్తున్నాయి. మరో చిత్రాన్ని మెగాస్టార్ రీమేక్ చేయనున్నారని తెలుస్తోంది. అజిత్ నటించిన 'విశ్వాసం'ను మెగాస్టార్ రీమేక్ చేయనున్నారని సమాచారం. వీవీ వినాయక్ దర్శకత్వం వహించనున్నారని తెలుస్తోంది. వినాయక్‌కు పూర్తి స్క్రిప్ట్ డిజైన్ చేయమని చిరు సూచించినట్టు వదంతులు షికార్లు కొడుతున్నాయి. సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. 'విశ్వాసం' యాక్షన్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందింది. సిరుతై శివ దర్శకత్వం వహించారు. సత్యజ్యోతి ఫిలిమ్స్ రూపొందించింది. అజిత్ కుమార్, నయనతార, జగపతి బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. చిరు కొన్నాళ్ల క్రితమే 'లూసిఫర్' రీమేక్‌లో నటించారు. 'గాడ్ ఫాదర్' టైటిల్‌తో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ మిక్స్‌డ్ టాక్‌ను తెచ్చుకుంది. ఇక చిరంజీవి కెరీర్ విషయానికి వస్తే.. తాజాగా 'వాల్తేరు వీరయ్య'లో నటించారు. మైత్రీ మూవీస్ నిర్మించింది. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా విడుదలైంది. భారీ స్థాయి వసూళ్లను రాబట్టింది. రూ. 100కోట్లకు పైగా కలెక్షన్స్‌ను కొల్లగొట్టింది.

విద్యార్థులకు నిత్యామీనన్ పాఠాలు

హైదరాబాద్:
నిత్యామీనన్ టీచర్ అవతార మెత్తారు. చిన్నారులకు పాఠాలు చెప్పారు. అయితే ఇది సినిమాలో పాత్ర కోసం కాదు. దక్షిణాదిలో కథానాయికగా బిజీగా ఉన్నారామె. ప్రస్తుతం ఆమె ఓ మలయాళ చిత్రం షూటింగ్ కోసం తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణాపురం గ్రామంలో సందడి చేశారు. అక్కడ షూటింగ్ పూర్తయిన తర్వాత లోకేషన్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లారామె. అక్కడి బాలబాలికలతో కాసేపు గడిపారు. ఆంగ్ల పాఠాలు బోధించారు. ఇంగ్లిష్ పాఠాలను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలుగులో వివరించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను నిత్యామీనన్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. "కృష్ణాపురం గ్రామంలో ఈ చిన్నారులతో నా న్యూ ఇయర్ డే ఇలా గడిచింది. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు బాల్యాన్ని ఎంతో ఆనందంగా గడుపుతారని ఈ చిన్నారులను చూశాక అర్థమైంది. వాళ్లు నా చుట్టూ ఉన్నప్పుడు నేనూ ఎంతో ఆనందంగా ఉన్నా" అని నిత్యా పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో నెటిజన్లను విపరీతంగా అలరిస్తుంది. ఆమె పిల్లలకు తెలుగులో పాఠం చెబుతుంటే నిత్యా చక్కగా తెలుగు మాట్లాడుతోంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

ఉసేన్ బోల్ట్ ఖాతా నుంచి రూ.103 కోట్లు మాయం

న్యూదిల్లీ:
వరల్డ్ బెస్ట్ స్ప్రింటర్, జమైకా పరుగుల వీరుడు ఉసేన్ బోల్ట్ భారీ ఆర్థిక మోసానికి గురయ్యాడు. అతని ఖాతా నుంచి దాదాపు రూ.103 కోట్లు (12.7 మిలియన్ డాలర్లు) మాయమైనట్లు తెలుస్తోంది. ఓ ప్రైవేటు పెట్టుబడుల సంస్థలో బోల్ట్ పెట్టుబడిగా ఈ డబ్బులను ఉంచగా.. ఆ సంస్థకు చెందిన ఉద్యోగి భారీ స్కామ్ చేసినట్లు సమాచారం. జమైకాకు చెందిన స్టాక్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ (ఎస్ఎస్ఎల్) సంస్థలో బోల్ట్ కొన్నేళ్ల కిందట ఓ పెట్టుబడి ఖాతా తెరిచాడని, రిటైర్మెంట్, లైఫ్‌టైం సేవింగ్స్‌లో భాగంగా ఈ ఖాతాను కొనసాగిస్తున్నాడని అతని న్యాయవాది మీడియాకు తెలిపారు. ఈ ఖాతాలో ఉసేన్ బోల్ట్‌కు 12.8 మిలియన్ డాలర్లు ఉండగా.. జనవరి రెండో వారం నాటికి కేవలం 12000 డాలర్ల బ్యాలెన్స్ మాత్రమే చూపించిందని సదరు న్యాయవాది వెల్లడించారు. కంపెనీలో జరిగిన మోసపూరిత చర్య వల్ల డబ్బులు మాయమైనట్లు ఆరోపించారు. పది రోజుల్లోగా ఆ డబ్బును తిరిగి ఖాతాలో జమచేయాలని, లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కంపెనీకి నోటీసులు పంపించినట్లు తెలిపారు. ఇక ఈ మోసాన్ని ఈ నెల ఆరంభంలోనే గుర్తించినట్లు స్టాక్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ కంపెని ఓ ప్రకటనలో తెలిపింది. ఓ మాజీ ఉద్యోగి మోసపూరిత కార్యకలాపాల కారణంగా తమ క్లయింట్స్ ఖాతాల్లో నుంచి మిలియన్ డాలర్ల మొత్తం మాయమైనట్లు జనవరి 12న కంపెనీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఉసేన్ బోల్ట్ సహా దాదాపు 30 మంది ఖాతాదారులు నుంచి సదరు వ్యక్తి డబ్బులు కొట్టేసినట్లు పేర్కొంది. దీనిపై దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశామని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ఇక ఈ ఘటనపై జమైకా ఆర్థిక మంత్రి నిగెల్ క్లార్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తీవ్రమైన నేరమని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని అధికారులను సూచించారు.

ఆమ్లా... నీ గురించి తప్పకుండా పుస్తకం రాస్తా: ఏబీడీ



న్యూదిల్లీ:
దక్షిణాఫ్రికా టాప్ బ్యాటర్ హషీమ్ ఆమ్లా క్రికెట్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పేశాడు. మూడేళ్ల కిందటే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆమ్లా, ఆ తర్వాత కౌంటీలు, దేశవాళీ క్రికెట్ ఆడుతూ వచ్చాడు. తాజాగా అన్ని ఫార్మాట్లతో కలిపి రిటైర్‌మెంట్ ప్రకటించేశాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్, మిస్టర్ 360 ఆటగాడు ఏబీ డివిలియర్స్ (ఏబీడీ) భావోద్వేగానికి గురయ్యాడు. తన సహచరుడి ఆటను ఇక నుంచి చూడలేక పోవడంపై ట్విటర్ వేదికగా స్పందించాడు. "హషీమ్ ఆమ్లా. నీ గురించి మాట్లాడటానికి నేను ఎక్కడ నుంచి ప్రారంభించాలి? రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు.. ఇలా ఎంతో ముందుకు వెళ్లాలి. తప్పకుండా నీ గురించి నేను పుస్తకం రాస్తా. నాకు ఎల్లవేళలా తోడుగా ఉన్న ఆమ్లా.. ఒక సోదరుడిగా మద్దతుగా నిలిచావు. అన్నివిధాలుగా సురక్షిత స్థానంలో ఉండేలా చేశావు. అయితే నీలాంటి ప్రయాణం సులువేం కాదు. విచిత్రమైన టెక్నిక్ ఉన్న ఆటగాడివి. అయితే నీకంటూ ప్రత్యేకమైన మార్గం నిర్మించుకొన్నావు. మైదానంలోకి దిగితే గంటలపాటు బ్యాటింగ్ చేశావు. నిశ్శబ్దంగా, నిలకడగా, నైపుణ్యం, మర్యాదతో కూడిన నీ ఆటను ఆస్వాదించడం ఆనందంగా ఉంది. జట్టు కోసం, దేశం కోసం ఎప్పుడూ ముందుండేవాడివి. నీ నుంచి ఎలా స్ఫూర్తి పొందాననేది మాటల్లో వర్ణించలేను. నా స్నేహితుడికి సెల్యూట్. నీ కచ్చితమైన బ్యాటింగ్ నుంచి ఎంతో నేర్చుకొన్నాం. మరోసారి నీతో ఎప్పటికైనా బ్యాటింగ్ చేయాలని ఉంది" అని ఏబీడీ తెలిపాడు. 2004లో దక్షిణాఫ్రికా తరపున అరంగేట్రం చేసిన హషీమ్ ఆమ్లా 2019లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ క్రమంలో 124 టెస్టుల్లో 9,282 పరుగులు, 181 వన్డేల్లో 8,113 పరుగులు సాధించాడు. అంతర్జాతీయ కెరీర్‌లో మొత్తం 55 సెంచరీలు (28 టెస్టుల్లో/ 27 వన్డేల్లో) సాధించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.